# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

గురువారం, జూలై 18, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రాగల ఐదు రోజులు తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

హైదరాబాద్: రాష్ట్రంలో ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని తెలిపింది.

ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. నిన్న దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర విదర్భ ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రాంతం ఈ రోజు బలహీనపడినట్లు తెలిపింది. రుతుపవన ద్రోణి ఈరోజు జైసాల్మయిర్, కోట, గుణ, కళింగపట్నం తూర్పు ప్రాంతం గుండా మధ్య బంగాళాఖాతం వరకు పయనిస్తూ సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. మరో అల్పపీడనం ఈ నెల 19న పశ్చిమ మధ్య దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

## గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్..
## 12మంది మావోయిస్టుల మృతి

గడ్చిరోలి: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. చత్తీస్‌గఢ్ సరిహద్దులోని వండోలి గ్రామం సమీపంలో 12 నుంచి 15మంది మావోయిస్టులు ఉన్నారని సమాచారం అందడంతో ఉదయం 10గంటల సమయంలో డిప్యూటీ ఎస్పీ సారథ్యంలో పోలీసులు ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య మధ్యాహ్నం మొదలైన భీకర కాల్పులు సాయంత్రం వరకు కొనసాగాయని పోలీసు అధికారులు తెలిపారు. దాదాపు ఆరు గంటల పాటు కాల్పులు జరగ్గా.. ఇప్పటివరకు 12మంది మృతదేహాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. అలాగే, మూడు ఏకే-47 తుపాకీలతో పాటు ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో తిపాగడ్ దళం ఇంఛార్జి డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం అలియాస్ విశాల్ ఆత్రం ఉన్నట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. మిగతా మృతదేహాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మృతుల్లో ఇద్దరు తెలుగువాళ్లు ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఈ కాల్పుల్లో ఒక జవాన్‌కు బుల్లెట్ గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం నాగ్‌పూర్‌కు తరలించారు.



## దుబాయ్ యువరాణి 'ఇన్‌స్టాలో విడాకులు'!

దుబాయ్ యువరాణి షైకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన భర్త షేక్ మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌తో విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ దంపతులకు తొలి సంతానం కలిగిన రెండు నెలలకే ఈ ప్రకటన రావడం గమనార్హం. అయితే, ఈ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమం వేదికగా ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది. "ప్రియమైన భర్తకు.. మీరు ఇతరుల సహచర్యం కోరుకున్నందున మీతో విడాకులు తీసుకోవాలని నిశ్చయించుకున్నా. 'ఐ డైవర్స్ యూ'. టేక్ కేర్.. మీ మాజీ భార్య" అని షైకా మహ్రా ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఇదే సమయంలో దంపతులిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేయడం, వారు కలిసి దిగిన ఫొటోలను డిలీట్ చేయడంతో ఈ వార్త వైరల్‌గా మారింది. సోషల్ మీడియాలో ఒకరినొకరు బ్లాక్ చేసుకున్నారని కొందరు.. షైకా మహ్రా అకౌంట్ హ్యాక్ అయ్యిందని మరికొందరు చర్చించుకుంటున్నారు. పలువురు నెటిజన్లు మాత్రం సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని మహ్రాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె షేక్ మహ్రా. బ్రిటన్‌లో ఉన్నతవిద్య అభ్యసించిన ఆమె అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు.



## మీ పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేయండి
### ప్రధాని మోదీ



దిల్లీ: డిజిటల్ ప్రపంచంలో జీవిస్తోన్న మనం నిత్యం హ్యాకింగ్, సైబర్ మోసాలు, వైరస్ దాడుల గురించి వింటున్నాం. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ అధికారులకు ఓ సూచన చేశారు. పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేయాలని చెప్పినట్లు ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

"రోజూ పని పూర్తయిన వెంటనే మీ సిస్టమ్స్ లాగౌట్ చేస్తారా..? నేను చేస్తాను. సైబర్ భద్రత విషయంలో ఇది చాలా ముఖ్యం" అని మోదీ హెచ్చరించారు. రోజు చివర్లో అన్ని సిస్టమ్స్ లాగౌట్ అయ్యాయా..?లేదా..? చూసుకొనే పనిని ప్రతీ ఆఫీస్‌లో ఒక వ్యక్తికి అప్పగించాలంటూ

- మిగతా 2వ పేజీలో



## డిగ్రీ పూర్తయితే నెలకు 10వేలు..
### మహారాష్ట్రలో కొత్త స్కీమ్

ముంబయి: మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ శిందే సర్కారు కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. నిరుద్యోగ యువత కోసం ఓ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి యువ కార్య ప్రశిక్షణ యోజన పేరుతో నిరుద్యోగ యువతకు వారి విద్యార్హతలను బట్టి నెల నెలా బ్యాంకు అకౌంట్లలో స్టయిఫండ్‌ను జమ

- మిగతా 2వ పేజీలో



# సంబురాలు జరిపి.. సగర్వంగా చాటి చెప్పండి

**ఈ రోజు సాయంత్రం 4 గంటలలోగా రూ.లక్ష రుణమాఫీ**

**ఈనెలాఖరులోపు లక్షన్నర.. ఆగస్టులో రూ.2 లక్షలు**

**ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్: ఆగస్టులోపే 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలకు నిధుల విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు రూ.1.5లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఆగస్టులో రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని సీఎం వివరించారు.

### గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం

ప్రజాభవన్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పాం. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ రూ.28వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారు. రైతు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఆయన మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మన బాధ్యత. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం. పార్టీకి నష్టమని తెలిసి కూడా సోనియాగాంధీ ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.

### వీధికుక్కల దాడిలో బాలుడి మృతి ఘటన కలచివేసింది: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: కుక్కల దాడిలో బాలుడి మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాలుడి మృతి కలచివేసిందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధికుక్కల దాడిపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పశు వైద్యులు, బ్లూక్రాస్ వంటి సంస్థల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. కుక్క కాటుకు అన్ని ఆసుపత్రుల్లో తక్షణం వైద్యం అందించాలని ఆదేశించారు. శునకాల నియంత్రణలో ఇతర రాష్ట్రాల పద్ధతులను పరిశీలించాలని చెప్పారు. జవహర్‌నగర్‌లో వీధికుక్కల దాడిలో 18 నెలల చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే.

### రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ

ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలి. వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలి. నా జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు.

- మిగతా 2వ పేజీలో

## తెలుగు రాష్ట్రాల్లో మొహరం ప్రార్థనలు



హైదరాబాద్: మొహరం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని మసీదుల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేస్తున్నారు. నేడు హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఇందులో భారీఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. మొహరం సందర్భంగా పాతబస్తీలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఊరేగింపు సాగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఇమామ్ హుస్సేన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: సీఎం చంద్రబాబు

పవిత్ర మొహరం పుణ్య దినాల సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభం కలిగేలా చూడాలని ఆకాంక్షిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అమరవీరుడు ఇమామ్ హుస్సేన్ సమాజం కోసం ప్రాణ త్యాగం చేశారు తప్ప అన్యాయమైన అధికారానికి తలొగ్గలేదన్నారు. ఇదే ఆదర్శంగా పరుల క్షేమాన్నికాంక్షిస్తూ జీవితాన్ని గడపడమే మన కర్తవ్యమని చంద్రబాబు చెప్పారు.

### మొహరం తెలంగాణ గంగా, జమునా సంస్కృతికి ప్రతీక: కేసీఆర్

పీర్ల పండగ హిందూ, ముస్లింల ఐక్యతను గుర్తు చేస్తుందని భారాస అధినేత కేసీఆర్ తెలిపారు. మొహరం తెలంగాణ గంగా, జమున సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.



## ఏడాదికి రెండుసార్లు పరీక్షలు

సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలపై కేంద్రం ఆప్షన్..! 2లో

## ఆ ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోం: హరీశ్‌రావు



పటాన్‌చెరు: పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోమని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరులో నిర్వహించిన భారాస కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టులో పోరాడుతున్నామని, ఆ నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందన్నారు. 2001లో కేసీఆర్ ఉద్యమాన్ని పిడికెడు మందితో ప్రారంభించారని.. అప్పుడు కూడా కుట్రలు జరిగాయని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ పార్టీకి చెందిన 12మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్నారన్నారు. కానీ, కుట్రలు ఫలించలేదని, న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ 14 ఏళ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

- మిగతా 2వ పేజీలో



## సూర్యాపేట జిల్లాలో విషాదం..
## క్వారీ గుంతలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి

2లో

## కమిట్మెంట్ ఉన్న నాయకులకే మంత్రివర్గ విస్తరణలో చోటు

### మంత్రివర్గ విస్తరణపై రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

యాదాద్రి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలుదాటుతోంది. అయితే ఇంకా పూర్తిస్థాయిలో మంత్రివర్గం కొలువుదీరలేదు. కేవలం రేవంత్‌తో పాటు 11మంది మంత్రులతో కేబినెట్ కూర్పు చేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయలేదు. దీంతో కాంగ్రెస్‌లో ఆశవాహుల సంఖ్య పెరిగిపోతుంది. ఎన్నికల తర్వాత కేబినెట్‌ను విస్తరించాలని కాంగ్రెస్ హైకమాండ్ ఆలోచించింది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాయి. దీంతో మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ దృష్టి సారించింది. రేవంత్ మంత్రివర్గంలో ఆరు బెర్తులు

- మిగతా 2వ పేజీలో

## ఏడాదికి రెండుసార్లు పరీక్షలు

- మొదటిపేజీ తరువాయి

సీబీఎస్ఈ పది, 12వ తరగతి బోర్డు పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించేలా కేంద్ర విద్యాశాఖ కొంతకాలంగా ముమ్మర కసరత్తు చేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరం నుంచే ఈ సరికొత్త విధానాన్ని అమలుచేసేలా వ్యూహరచన చేయాలని ఇప్పటికే సీబీఎస్ఈని కోరింది. ఈ క్రమంలోనే 12వ తరగతి పరీక్షలపై త్వరలోనే ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం మార్చిలో ఒకసారి, జూన్‌లో రెండోసారి నిర్వహించే అంశాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ఏడాదిలో రెండుసార్లు బోర్డు పరీక్షలను నిర్వహించే అంశంపై పాఠశాలల ప్రిన్సిపాళ్లతో ఇటీవల సీబీఎస్ఈ విస్తృత సంప్రదింపులు జరిపింది. ఇందులో సెమిస్టర్ విధానంపై చర్చించగా.. దానిపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఎప్పటిలాగే ఫిబ్రవరి-మార్చిలో 12వ తరగతి విద్యార్థులకు బోర్డు పరీక్ష నిర్వహించి.. ఆ తర్వాత జూన్‌లో మరోసారి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ సిఫార్సులను కేంద్ర విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం 12వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి-మార్చిలో బోర్డు పరీక్షలు నిర్వహించగా.. మే నెలలో ఫలితాలను విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత విద్యార్థులు ఏదైనా ఒక సబ్జెక్టులో మాత్రమే మార్కులను పెంచుకునేందుకు 'సప్లిమెంటరీ పరీక్షలు' రాయొచ్చు. పాస్ కాని 'కంపార్ట్‌మెంట్' విద్యార్థులకు ఇక సప్లిమెంటరీ రాసే అవకాశముంది.

ఒకవేళ కొత్త విధానం అమల్లోకి వస్తే.. మార్చిలో పరీక్షలు రాసిన విద్యార్థులు జూన్‌లో మరోసారి అన్ని పరీక్షలు రాసేందుకు వీలుంటుంది. అయితే, అది పూర్తిగా విద్యార్థుల ఐచ్ఛికమే కానీ తప్పనిసరేం కాదట. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష జేఈఈ మాదిరిగానే విద్యార్థులు తమ ఉత్తమ స్కోరును ఎంచుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అంతేగాక, రెండోసారి అన్ని పరీక్షలు కాకుండా తమకు మార్కులు తక్కువ వచ్చిన ఒకటో రెండో పరీక్షలు కూడా రాసుకునే అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. దీనిపై త్వరలో కేంద్రం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

సీబీఎస్ఈ బోర్డు పరీక్షలను సంస్కరించడం ఇది తొలిసారేమీ కాదు. 2009లో పదో తరగతికి సీసీఈ (కంటిన్యూస్, కాంప్రెహెన్సివ్ ఎవల్యూషన్) విధానాన్ని ప్రవేశపెట్టారు. 2017లో దీన్ని ఎత్తేసి, మళ్లీ పాత విధానాన్నే అమలుచేశారు. కొవిడ్ సమయంలోనూ 10, 12 తరగతుల వార్షిక పరీక్షలను ఏడాదికి రెండు విడతలుగా నిర్వహించి.. తిరిగి పాత పద్ధతినే కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

## మీ పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేయండి

- మొదటిపేజీ తరువాయి

సూచించారు. ఇంటికి వెళ్లేప్పుడు తన సిస్టమ్‌ను తానే లాగౌట్ చేసుకుంటానని చెప్పారు. వాటిని ఓపెన్ చేసి ఉంచటం వల్ల సైబర్ దాడుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులతో అన్నారు.

ఇటీవల సీనియర్ బ్యూరోక్రాట్లతో జరిగిన సమావేశంలో ప్రధాని ఈ హెచ్చరికలు చేశారు. ఈ మార్చిలో ప్రధాని మోదీతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ 'చాయ్ పే చర్చ'లో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా తాను గేట్స్‌తో సైబర్ భద్రత గురించి చర్చించినట్లు చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ వ్యవస్థలు సైబర్ దాడులకు గురైన నేపథ్యంలో సైబర్ భద్రత కేంద్ర ప్రభుత్వానికి కీలకాంశంగా మారింది. ఇక ఈ సమావేశం అనంతరం కేబినెట్ సెక్రటరీ ఆ దిశగా బ్యూరోక్రాట్లకు రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారు.

'చాయ్ పే చర్చ'లో మోదీ, గేట్స్ డిజిటల్ టెక్నాలజీ గురించి చర్చించుకున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ.."సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి నేను ఇష్టపడతా. కొత్త విషయాలను తెలుసుకోవడానికి చాలా ఉత్సుకతతో ఉంటా. మా అధ్యక్షతన జరిగిన జీ20 సదస్సులో ఏఐ టెక్నాలజీని వినియోగించుకున్నాం. ఏఐ శక్తిమంతమైనదే. కానీ.. దాన్ని మ్యాజిక్ టూల్‌గా ఉపయోగిస్తే అది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. సరైన శిక్షణ లేకుండా దీన్ని ఉపయోగిస్తే దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడితే వక్రమార్గంలో పయనిస్తుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో డీప్‌ఫేక్‌ను ఎవరైనా వినియోగించొచ్చు. డీప్‌ఫేక్‌తో నా గొంతును కూడా అనుకరించారు" అని వెల్లడించిన సంగతి తెలిసిందే.

## డిగ్రీ పూర్తయితే నెలకు 10వేలు..

- మొదటిపేజీ తరువాయి

చేయనున్నారు. ఇందుకోసం రూ.5,500 కోట్లు వెచ్చించనున్నారు. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఏక్‌నాథ్ శిందే సర్కారు ఈ స్కీమ్‌ను ప్రకటించడం గమనార్హం.

18-35 ఏళ్ల వయసు గల మహారాష్ట్ర నివాసితులు ఈ పథకానికి అర్హులు. కనీసం 12 తరగతి పాసై పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఈ పథకం కింద లబ్ధి పొందొచ్చు. ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందడంతో పాటు పరిశ్రమ అవసరాలకు యువతను సిద్ధం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కాలంలో అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. 12వ తరగతి పాసైన వారికి నెలకు రూ.6వేలు, ఐటీఐ/ డిప్లొమా పూర్తి చేసిన వారికి రూ.8 వేలు, డిగ్రీ/పీజీ పూర్తి చేసిన వారికి రూ.10 వేలు చొప్పున స్టయిఫండ్ చెల్లించనున్నారు.

## సూర్యాపేట జిల్లాలో విషాదం.. క్వారీ గుంతలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఈత సరదా ముగ్గురు ప్రాణాలను బలి తీసుకుంది. క్వారీ గుంతలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతులు శావల్య రాజు (45) అతడి కూతురు శ్రావల్య ఉష (12),శ్రీపాల్ రెడ్డి (40 )గా గుర్తించారు. మృతులు హైదరాబాద్ నుంచి బంధువుల ఇంటికి వచ్చి స్థానిక క్రషర్ గుంతల్లో ఈతకు వెళ్లినట్లు సమాచారం. చుట్టపు చూపుగా వచ్చి ఒకేసారి ముగ్గురు మృత్యువాత పడటంతో బొప్పారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సంఘటన సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# సంబురాలు జరిపి.. సగర్వంగా చాటి చెప్పండి

- మొదటిపేజీ తరువాయి



సాయంత్రం 4గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తున్నాం. రూ.7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళతాయి. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తాం. ఆగస్టులోగా రూ.2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేసి ఆ ప్రక్రియను పూర్తి చేస్తాం. రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. అందుకే ఏక మొత్తంలో రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నాం. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ. మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించండి.

### హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి

గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించండి. రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ.31వేల కోట్లతో రుణమాఫీ చేయలేదు. రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్ లో ఎంపీలు ప్రస్తావించాలి. గురువారం గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలి. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబరాలు జరపాలి. ఏడు నెలల్లో మన ప్రభుత్వం సంక్షేమానికి రూ.30వేల కోట్లు ఖర్చు చేసింది" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

### అప్పుల్లో ఉన్నా.. నెలల వ్యవధిలోనే రుణమాఫీ అమలు చేస్తున్నాం: భట్టి

ఆగస్టు నెల దాటకుండానే రూ.2లక్షల రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ హామీ అమలు కోసం నిద్రలేని రాత్రులు గడిపామని, రూపాయి.. రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని తెలిపారు. రుణమాఫీ కార్యక్రమాన్ని పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటరు దగ్గరకు తీసుకెళ్లాలని, తల ఎత్తుకొని.. ఎక్కడా తగ్గకుండా ప్రచారం చేయాలని కాంగ్రెస్ నాయకులకు భట్టి సూచించారు.

"రూ.7లక్షల కోట్ల అప్పుతో అధికార బాధ్యతలు తీసుకున్న కాంగ్రెస్ రూ.2లక్షల రుణమాఫీని నెలల వ్యవధిలోనే అమలు చేస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే హామీలు అమలు చేస్తున్నాం. కానీ, అనుకున్నంత ప్రచారం క్షేత్రస్థాయిలో జరగట్లేదు. పార్లమెంట్ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారు. సీఎం సవాల్ ఓట్ల కోసమే అనుకున్నారు. కానీ, అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రుణమాఫీ చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని వివరిస్తూ రైతులు, ప్రజల హృదయాలు గెలవాలి" అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



## ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ఈ ఏడాది రూ.10 వేల నుంచి రూ.11వేల కోట్లు వెచ్చించి కొత్తగా 6.5లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని తెలంగాణ భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎర్రమంజిల్ జలసౌధలో అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రతిష్టాత్మక పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, బీమా, నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టుల నిర్మాణం, పురోగతిపై విస్తృతంగా చర్చించారు. గుత్తేదారులు సకాలంలో పనులు చేస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ప్రాధాన్యతల వారీగా పాలమూరు-రంగారెడ్డి, కొడంగల్, అచ్చంపేట, పాలెంవాగు, మత్తడివాడు, ఎస్ఆర్ఎస్‌పీ-2, చిన్న కాళేశ్వరం, శ్రీపాద, లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టుల నిర్మాణం మార్చి వరకు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు.

ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు కోసం కోయల్‌సాగర్, కల్వకుర్తి వంటి ఎత్తిపోతల పథకాల నిర్మాణం, ఇతర ప్రాజెక్టుల నిర్మాణం 100శాతం పూర్తి చేయడంపై ఈ సమీక్షలో చర్చించినట్లు తెలిపారు. ఈ మేరకు ఇంటీరియం బడ్జెట్ కింద రూ.28వేల కోట్లు కేటాయించాలని ఆర్థిక శాఖను కోరాలని నిర్ణయించినట్లు చెప్పారు. వీటిలో రూ.18వేల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ చెల్లించడంతోపాటు మరో రూ.2వేల కోట్లు ఉద్యోగుల వేతనాలు, పింఛన్లకు పోగా.. రూ. 8వేల కోట్లు కొత్త ప్రాజెక్టుల పనుల కోసం కేటాయింపు చేస్తామని స్పష్టం చేశారు. నీటి పారుదల శాఖలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు, బదిలీలు త్వరలోనే చేపడతామని ఉత్తమ్ చెప్పారు.

ఈనెల 20న నీటిపారుదశాఖ సలహాదారు, ముఖ్య కార్యదర్శి, నిపుణుల కమిటీ సభ్యులు, ఈఎన్‌సీ దిల్లీకి వెళ్లి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌తో సమావేశమవుతామని తెలిపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు దృష్ట్యా వరదలు రాని నేపథ్యంలో ఎన్‌డీఎస్ఏ సిఫారసు మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లపై తీసుకున్న చర్యలు, పెండింగ్ అంశాలు, ఆనకట్టల భద్రతపై చర్చిస్తామన్నారు.

## ఆ ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోం: హరీశ్‌రావు

- మొదటిపేజీ తరువాయి

"భారాస పని అయిపోయిందన్నవాళ్లు తర్వాత కనిపించకుండా పోయారు. పార్టీకి కష్టాలు వస్తాయి. ఎమ్మెల్యే పోతే పార్టీ పోదు. పటాన్‌చెరులో మంచి కార్యకర్తలు ఉన్నారు. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే. మీరందరూ కష్టపడితేనే మహిపాల్ రెడ్డి గెలిచారు. పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చాం. రోడ్లు, తాగునీరు, స్టేడియం వంటివి ఎన్నో అందించాం. నిధుల వరద పారించాం. గూడెం పోయినా గుండె ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్ ఇప్పుడు ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారు. జీవోలో రేషన్ కార్డు ఆధారంగా రైతు రుణమాఫీ అని చెప్పారు. మళ్లీ వ్యతిరేకత వస్తోందని మాట మార్చుతున్నారు. పాస్‌బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటతో చెబుతున్నారు. అదే నిజమైతే జీవో మార్చాలి. వడ్లకు బోనస్ అన్నారు.. తర్వాత సన్నవడ్లకే బోనస్ అంటూ 90 శాతం రైతులకు బోనస్ ఎగ్గొట్టారు. ఇప్పుడు రుణ మాఫీ విషయంలోనూ అదే చేస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ సరిగ్గా అమలు కాలేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

## కమిట్మెంట్ ఉన్న నాయకులకే మంత్రివర్గ విస్తరణలో చోటు

- మొదటిపేజీ తరువాయి



ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఇప్పటివరకు కేబినెట్‌లో చోటు దక్కని జిల్లాలకు అవకాశం కల్పించే ఉద్దేశంతో నలుగురు పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానానికి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

కాగా .. మంత్రివర్గ విస్తరణపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. చౌటుప్పల్లో రాజ్ గోపాల్ రెడ్డి ఈరోజు(బుధవారం) పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మంత్రివర్గ విస్తరణ అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వ్యాఖ్యానించారు. కమిట్మెంట్ ఉన్న నాయకులకు మంత్రివర్గ విస్తరణలో చోటు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మంత్రివర్గ విస్తరణ వాయిదా పడిందని వివరించారు.

## తెలుగులో రుణమాఫీ ఉత్తర్వులు అభినందనీయం

### రేవంత్‌రెడ్డికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి ప్రశంస

### ధన్యవాదాలు చెప్పిన ముఖ్యమంత్రి



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతుల రుణమాఫీ మార్గదర్శకాలపై ఉత్తర్వులను తెలుగులో జారీ చేయడం అభినందనీయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. "తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా పరిపాలనకు సంబంధించిన అంశాలన్నీ తెలుగులోనే జారీ చేయాలని నేను ఎప్పటినుంచో కోరుతున్నా. ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు వారికి సులువుగా అర్థమయ్యే మాతృభాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించి ఇతర సమాచారం ఉండాలని చెబుతున్నా. ఈమేరకు ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యమిస్తూ తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుకు, ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న అధికారులు, సిబ్బందికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇకపై అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలి" అని వెంకయ్యనాయుడు బుధవారం 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. అభినందనలు తెలిపిన వెంకయ్యనాయుడుకు హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు.



## హైదరాబాద్‌లో విన్‌ఫాస్ట్ పెట్టుబడులు

### నగర విస్తరణకు మౌలిక సదుపాయాల కల్పన.. మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్: వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ 'విన్‌ఫాస్ట్' హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఆసక్తి కనబర్చింది. సచివాలయంలో విన్‌ఫాస్ట్ కంపెనీ భారత సీఈవో ఫామ్ సాన్హ చౌ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం బుధవారం ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ అయింది. ఈ సందర్భంగా పెట్టుబడులకు అవకాశాలపై చర్చించారు. ప్రభుత్వ రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, అర్బన్ మొబిలిటీలో సొల్యూషన్స్, భవిష్యత్‌లో నగరాల అభివృద్ధి, అందుకు తగ్గట్టుగా సామాజిక గృహ నిర్మాణాలు తదితర అంశాలపై మంత్రి వారితో చర్చలు జరిపారు. "ప్రపంచంలోనే హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. పెరుగుతున్న పట్టణ వలసల కారణంగా వచ్చే 15 ఏళ్లలో తెలంగాణ జనాభాలో సగం మందికి ఇది నిలయంగా మారనుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యం. అందుకోసం విశ్వసనీయమైన భాగస్వాముల సహకారం అవసరం" అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఇందుకు విన్‌ఫాస్ట్ తన సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు మంత్రి తెలిపారు. ఆ సంస్థ ఇటీవలే తమిళనాడులో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి సంస్థను రూ.4వేల కోట్ల పెట్టుబడులతో ప్రారంభించింది. తదుపరి విస్తరణలో భాగంగా తెలంగాణపై దృష్టిపెట్టింది. భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఈ సంస్థకు విశేష గుర్తింపు ఉంది. రాష్ట్రంలో భారీ వాణిజ్య సదుపాయాల మౌలిక వసతుల కల్పనే కాకుండా.. సాధారణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని గృహ నిర్మాణాలపై కూడా దృష్టిపెట్టాలని మంత్రి సూచించారు.

# రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన

## ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,చామల కిరణ్ కుమార్ రెడ్డి



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):–రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ల చిత్రపటానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇతర నాయకులతో కలసి బుధవారంరోజు ప్రజాభవన్‌లో పాల అభిషేకం చేశారు. రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో తెలిపినట్లుగానే తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా రేవంత్ రెడ్డి,బట్టి విక్రమార్క ల సమక్షంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశం అనంతరం రేవంత్ రెడ్డి,బట్టి విక్రమార్క ల చిత్రపటానికి పాలాభిషేకం చేసారు.ఈ సందర్భంగా రైతుల అందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



### ఆపదలో అండగా.. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):–ఎంత తిరిగినా పనైతలేదు బిడ్డా అని వచ్చే అమ్మలకు... అన్న గీ కష్టం వచ్చింది సాయం చేయమని కోరుతున్న సోదరులకు... పెన్షన్ అందకనో, ఇంకేదైనా సర్కార్ సాయం కావాలని వచ్చే అవ్వా–తాతలకు అండగా ఉండే ప్రయత్నం చేస్తున్నా వ్యక్తి ఆయనే ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి. ఇందులో భాగంగానే ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ సహాయం చేసేందుకు కృషి చేస్తూనే ఉంటానన్నారు.సీఎం రేవంతన్న సహకారంతో... ప్రజా పాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే నా కర్తవ్యంగా ముందకు సాగుతున్నానని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు.

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్



శేరిలింగంపల్లిబీ జులై 17(వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డిని ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఇరువురు పలు సమస్యలపై చర్చించారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని, అదేవిధంగా రాష్ట్ర పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ పరిలో ఇలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా ప్రధానంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సూచించారు.

### శ్రీ జయ దుర్గ మైసమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీ సభ్యులకు నియామ కపత్రం అందజేత

#### శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్



శేరిలింగంపల్లి, జులై 17(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ జయ దుర్గ మైసమ్మ తల్లి నూతన కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ సభ్యులకు కూన సత్యం గౌడ్ చైర్మన్ గుంజరి సత్యనారాయణ ముదిరాజ్, ఎం.కృష్ణా రెడ్డి, కె.గోపాలకృష్ణ, మాలెంపాటి సురేష్, ఎన్.శ్రీనివాస రెడ్డి, సదా మహేష్, జి.లహరి, బొడ్డ వెంకట మహాలక్ష్మి సభ్యులుగా నూతన కమిటీ నియామకపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావూరి ప్రసాద్,కొడాలి రవి,రాజీ రెడ్డి,వెంకటేష్, దగ్గిపాటి, వాసు, రామకోటేశ్వర రావు,శ్రీనివాస్ రావు,రాజేందర్ ప్రసాద్,వెంకట్ రావు,కొఠారి వెంకట్,ఎస్.వి రావు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఆలయాల్లో బోనాల నిర్వహణకు చెక్కుల పంపిణీ

#### ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇన్చార్జి బండి రమేష్.



కూకట్‌పల్లి, జులై 17(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని వివిధ దేవాలయాలో ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా ఆలయాల్లో సౌకర్యాల కల్పన కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు చెక్కుల పంపిణి కార్యక్రమం కూకట్ పల్లి సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్ సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయాల ప్రతినిధులకు చెక్కులను అందచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అమ్మవారి దేవాలయాల్లో సౌకర్యాల ఏర్పాటు కోసం రూపాయలు రూ.37 లక్షల 40 వేల చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సతీష్ రెడ్డి, నాగిరెడ్డి, పుష్పా రెడ్డి, లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఆలయాల్లో బోనాల నిర్వహణకు చెక్కుల పంపిణీ

#### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి : జులై 17(వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు ఆలయాలో వైభవంగా జరిగే బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వంచే అమ్మవారి దేవాలయాలకు చెక్కులు ఇచ్చే కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మరియు కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్ నియోయికవర్గ కార్పొరేటర్లు పాల్గొని దేవాలయ నిర్వాహకులకు చెక్కులను అందచేశారు. ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోచమ్మ దేవాలయాలకు అందించే చెక్కులను కూకట్ పల్లి లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో కలిసి బాలానగర్ డివిజన్ కు సంబంధించిన దేవాలయాల చెక్కులను అందజేసిన బాలనగర్ డివిజన్ కార్పొరేట్ ఆవుల రవీందర్ రెడ్డి డివిజన్ పరిధిలోని ఆలయాల నిర్వాహకులకు చెక్కులను అందజేశారు.

### టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్, బండి రమేష్‌ను కలిసిన సప్పిడి భాస్కర్



కూకట్ పల్లిబీ జులై 17(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ను మరియు టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ నల్లాసంజీవరెడ్డిలను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ మేరకు కూకట్ పల్లి నియోజకవర్గం లేబర్ సెల్ అధ్యక్షులుగా నియమితులైన సప్పిడి భాస్కర్ నియమితులయ్యారు. అనంతరం బండి రమేష్ మరియు నల్లా సంజీవరెడ్డి మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గంలో లేబర్ సెల్ ను బలోపేతం చేస్తూ సంఘటిత మరియు అసంఘటిత రంగాలకు చెందిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పదవి పొందిన సప్పిడి భాస్కర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ కార్యదర్శి కర్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



### మేయర్ దంపతులకు సన్మానం

#### కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ

బండ్లగూడ జాగీర్ ,17 జులై (వాయిస్ టుడే ): కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన బండ్లగూడ జాగిర్ మేయర్ లతా ప్రేమ్ గౌడ్ దంపతులను కాలనీ ప్రజలు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ సమస్యలు వివరించారు. కాలనీ సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇవ్వటంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు ఉన్నారు.



### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కి శుభాకాంక్షల వెల్లువ

బండ్లగూడ జాగీర్ ,17 జులై (వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సోసైటీ కార్పొరేషన్ చైర్మన్ గా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బుధవారం తెలుగు సంక్షేమ భవనంలో ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి తో పాటు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, మేయర్ భర్త ప్రేమ్ గౌడ్ కలసి పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారా కార్యక్రమానికి నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



### మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తోటకూర అజయ్ యాదవ్

#### హాజరైన వజ్రెష్ యాదవ్, పోగుల నరసింహా రెడ్డి

వాయిస్ టుడే న్యూస్, జులై 17 బోడుప్పల్ : బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ బుధవారం నాడు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్ లో మేయర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, బోడుప్పల్ నగర అధ్యక్షుడు పోగుల నరసింహా రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ లు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు హాజరయ్యారు.

### మేడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమం

#### పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి..!



వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమన్ని స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, మున్సిపల్ ఆర్వో. శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా జిహెచ్ఎంసి కట్ట మైసమ్మ అమ్మవారి కళ్యాణం- బోనాలు

#### పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బోనాల నేపథ్యంలో ప్రతి ఏటా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారికి జరిగే కళ్యాణ మహోత్సవం – బోనాల వేడుకలో భాగంగా మంగళవారం నిర్వహించిన వేడుకలలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రజలంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, జిహెచ్ఎంసి మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని కోరుకున్నారు.





### హిందూముస్లిం ఐక్యతకు నిదర్శనం మొహర్రం..

### దట్టీలు కట్టి కానుకలు సమర్పించిన మాజీ చైర్మన్ బర్రె జహంగీర్

భువనగిరి ( వాయిస్ టుడే ప్రతినిధి):– భువనగిరి మున్సిపల్ పట్టణంలోని భార ఇమామ్ పీర్ల ఆశీర్ కానలో మొహరం పండుగ పురస్కరించుకుని పిర్ల ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ విచ్చేసి పీర్లకు దట్టీలు కట్టి కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాట్లాడుతూ పీర్ల పండుగ మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలిచే పండుగని హిందూ ముస్లింలు సోదర భావంతో అత్యంత వైభవంగా జరుపుకుంటారని అన్నారు. ఆశర్ కాన కు స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుక పోయి మౌళిక సదుపాయాలకు కృషచేస్తమన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్,హీరేకార్ శ్రీనివాస్,బండారు రవివర్ధన్,పుట్ట గిరీష్ గౌడ్,ఎండి అఖిల్,బోయిని బాలయ్య,బర్రె చిరంజీవి తదితరులు పాల్గొని దట్టి సమర్పించి ప్రార్థనలు చేశారు.



## ఈ నెల 21న టీజేయు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలి

### టీజేయు జిల్లా అధ్యక్షులు ఎం డి.షానూర్ బాబా

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం 'తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో డాక్టర్.సుమంత్ కంటి హాస్పిటల్ సహకారంతో ఈ నెల 21న ఆదివారం రోజున నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జర్నలిస్టులు సద్వియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షానూర్ మాట్లాడుతూ జిల్లా లొ పనిచేస్తున్న జర్నలిస్టులకు ఏదైనా కంటి సమస్యలు ఉన్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు. నిర్వహించిన అనంతరం డాక్టర్ సూచన మేరకు కంటి అద్దాలు,మందులు ఉచితంగా ఇవ్వబడునని, సమయం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం1 గంటల వరకు, విజయ్ భార్గవ్ హాస్పటల్ పక్కన, మీనా నగర్, భువనగిరిలొ ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రషీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టి కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ బీ నగర్‌లో పీర్ల పండుగ సందర్భంగా దట్టిలు, పూల సిరా అందజేసిన పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి మున్సిపాలిటీ లో పీర్లు పండుగ ఉత్సవాలను లో భాగంగా స్థానిక మంగళవారం ఆర్ బీ నగర్‌లో అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు విద్యుత్తు కాంతులను,అగ్ని గుండం, భక్తుల కోసం మౌళిక సదుపాయాల కల్పించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. అసేదూల హారితి, కాళ్ళ గజ్జెలు ఇమ్మతి, డప్పుల మోతలతో ఆట,పాటలతో అప్రాంతమంత దద్దరిల్లింది. పీర్లు పండుగ సందర్భంగా పిసిసి డెలిగేట్ తంగేళ్లపల్లి రవికుమార్ పూల సిరా, దట్టీలు, సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అత్యంత వైభవంగా పండుగ ఉత్సవాలను జరుపుకోవడం ఇలాంటి సంప్రదాయం అనాదిగా వస్తుందని ఆయన అన్నారు. అన్ని వర్గాల ప్రజలను శాంతి, సామరస్యం, సమైక్యతను గుర్తు చేసేది పీర్లు పండుగ అన్నారు. ప్రతి ఒక్కరూ పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. మొక్కిన, దర్శించుకున్న కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అనాదిగా భక్తుల విశ్వాసం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహమ్మద్ సల్లవుద్దిన్, జలీల్ ఖాన్, యాదగిరి, సత్యనారాయణ, సలీం, శంకర్, ముతవలీ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.




## ఎత్తిపోతల పథకాలకు మరమ్మత్తులు ఎప్పుడు?

కోదాడ/నడిగూడెం ,జులై 17(వాయిస్ టుడే) నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువపై నిర్మితమై ,లక్షల ఎకరాల బీడు భూములకు, సాగు నీరు అందిస్తున్న ఎత్తిపోతల పథకాలు , గత ప్రభుత్వ హయాంలో మరమత్తులకు నోచుకోక , నిర్దేశించిన భూములకు నీరు అందక బీడు భూములుగా మారాయి. సాగర్ ఎడమ ప్రధాన కాలువ పై 50 పైగా ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి నిర్వహణ రైతులకు అప్పగించడంతో, రాజకీయ జోక్యం వలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారై శిధిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులకు నిధులు లేక రైతు కమిటీలు అలంకారప్రాయంగా మిగిలాయి. వాటి నిర్వహణకు ఎకరాకు 500 రూపాయలు చొప్పున వసూలు చేసి లిఫ్ట్ లను, నడిపించినట్లు నీటి సంగం చైర్మన్ లు, పలువురు కు తెలిపారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున అనేక లిఫ్టులు, అసంపూర్తిగా పనులు మిగిలి, శిథిలావస్థకు చేరుకొని మరమ్మతులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే చేపట్టి నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అదేవిధంగా కాలువలు శిథిలావస్థకు చేరుకొని, ఆక్రమణకు గురై, చివరి భూములకు నీరు అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. నడిగూడెం మండలంలో ఎల్ 34 ,ఎల్ 35 ,ఆర్ 9 ఆర్ 10 ఎత్తిపోతల పథకాల ట్రాన్స్ఫార్మర్లు, మోటర్లు కాలిపోయి ఉన్నాయని , వెంటనే మరమ్మతులు చేపట్టి, సాగునీరు అందించాలని రైతులు రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. ఆర్ 9,ఎత్తిపోతల పథకానికి ప్రత్యేక పైప్లైన్ వేసి తెల్లబల్లి ,ఈకే పేట, తండా, రామాపురం గ్రామాలకు త్రాగునీరు ,సాగునీరు అందించాలని , స్థానిక ఎమ్మెల్యే ఉత్తంకుమార్ రెడ్డి,మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కోరగా, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూత్కూరు వెంకటరెడ్డి తెలిపారు.

# మరో నాలుగు నెలల్లో ఒడిశా నైనీ బ్లాక్ నుండి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావాలి

**నిర్వాసిత గ్రామ ప్రజలకు మెరుగైన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ**

**సీఎస్ఆర్ పనులు, ఉపాధి అవకాశాలు కల్పించాలి**

**కాలక్రమ ప్రణాళికతో ముందుకు సాగాలి**

**అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జులాయి 17) ఎనర్జీ సెక్రటరీ రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జీఎం కో ఆర్డినేషన్ దేవేందర్ ఇతర అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. సింగరేణి సంస్థకు ఒడిశా రాష్ట్రంలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ కు సంబంధించి ఇంకా మిగిలిన పనులు వేగంగా పూర్తి చేసి నాలుగు నెలల్లో గని నుండి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం సచివాలయంలో నైనీ బొగ్గు బ్లాకు పై ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, ఇతర అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ బొగ్గు బ్లాక్ కు సంబంధించి ఇటీవలనే ఆయన ఒడిశా రాష్ట్రంలో పర్యటించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో చర్చించారు. అలాగే నిర్వాసిత గ్రామ ప్రజలతో, స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరాతో కలిసి సహకారాన్ని కోరారు. ఈ నేపథ్యంలో నైనీ బొగ్గు బ్లాక్ నుంచి త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తరపున తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

135 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి తొలిసారిగా తెలంగాణ వెలుపల చేపడుతున్న ప్రాజెక్టు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ, కంపెనీ ప్రతిష్టను పెంచేలా మైనింగ్ చేపట్టాలని, స్థానికుల సంక్షేమాన్నిదృష్టిలో ఉంచుకొని పనిచేయాలన్నారు.

నైని బొగ్గు బ్లాక్ కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించిన నేపథ్యంలో, సింగరేణికి ఆ రాష్ట్ర అటవీశాఖ ద్వారా బదలాయించిన 783.27 హెక్టార్ల అటవీ స్థలంలో చెట్ల లెక్కింపు, వాటి తొలగింపు, తదుపరి ఆ స్థలం అప్పగింత పై ఒడిశా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినందున ఆ రాష్ట్ర అటవీశాఖ తో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఈ పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ చూపాలని ఆయన సింగరేణి సంస్థను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక అధికారిగా నైనీ జనరల్ మేనేజర్ కు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. అలాగే ఏకైక నిర్వాసిత గ్రామ ప్రజలతో తాను, స్థానిక ఛెండిపడ ఎమ్మెల్యే అగస్తి బెహరా, స్థానిక ప్రజాప్రతినిధి ల తో చర్చించిన విధంగా స్థానికులకు పునరావాస పథకం, కార్పోరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు, గ్రామ యువతకు ఉపాధి అవకాశాలపై తగిన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి అంగీకరించిన విధంగా జరపడా నుంచి ఛెండిపడ వరకు గల ప్రస్తుత రోడ్డును విస్తరించడం, బలోపేతం చేయడం వంటి పనులు చేపట్టడంపై ఆ రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ సమన్వయం చేస్తూ త్వరితగతిని పూర్తి చేయడానికి చొరవ చూపాలని కోరారు. అలాగే హై టెన్షన్ విద్యుత్తు లైను ను వెంటనే నిర్మించే విధంగా ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ తో సంప్రదిస్తూ ముందుకు సాగాలని కోరారు. అలాగే పునరావాస, నష్టపరిహారం అంశాలపై చర్చించే ఆర్.పి.డి.ఏ.సి. మీటింగ్ ను అతి త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. నైనీ బొగ్గు బ్లాక్ నుండి ఉత్పత్తి ప్రారంభానికి ఇంకా పూర్తి కావలసి ఉన్న మరికొన్ని పనులపై కూడా ఆయన అంశాల వారీగా చర్చించారు. 2015 లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్ ను కేటాయించినప్పటికీ గడచిన ప్రభుత్వ నిరాసక్తత వల్ల ఇప్పటికీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదని, అయితే సింగరేణి పై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక చొరవ కారణంగా తాను స్వయంగా ఒడిశా రాష్ట్రం వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో అన్ని సమస్యల పరిష్కారానికి చర్చించడం జరిగిందన్నారు. నైనీ నుండి బొగ్గు ఉత్పత్తికి ఇప్పుడు పూర్తి సానుకూల పరిణామాలు నెలకొన్న నేపథ్యంలో నిర్ణీత కాలక్రమ ప్రణాళికను రూపొందించుకుని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రోజువారీగా నిర్దేశించుకున్న పనుల ప్రగతి పై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. బొగ్గు బ్లాకు పై ప్రత్యేక శ్రద్ధ చూపి మిగిలిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణి సంస్థ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో సూచించిన ప్రకారం ప్రతి పనికి నిర్దేశిత కాలపరిమితిని విధించుకొని పూర్తి చేస్తామని, ఈ ఏడాది అక్టోబరు నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వివరించారు.

## సాగులో ఉన్న పోడు భూములకు హక్కుపత్రాల ఇవ్వాలి

### చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి: గిరిజన సంఘం నేత కారం పుల్లయ్య



భద్రాచలం, జూలై 17 (వాయిస్ టు డే ) తరతరాలుగా సాగు చేస్తున్న పోడు సాగుదారులు అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేసారు. బుధవారం దుమ్ముగూడెం మండలం గద్దమడుగు, చెరుపల్లి జిన్నగట్ట, మారాయిగూడెం గిరిజన గ్రామాల్లో పుల్లయ్య పర్యటించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 న జరిగే చలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కు పోడు సాగుదారులందరూ తరలిరావాలని కోరారు. పోడు పట్టాలు వచ్చిన వారందరికీ పంట రుణాలు, త్రీఫేస్ విద్యుత్, వ్యవసాయ బోర్లు అందించాలని ఆయన కోరారు. వలస ఆదివాసీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 25వేల మంది గత 40 సంవత్సరాలు క్రితం మన ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి బతుకుదెరువు కోసం రావడం జరిగిందని వారందరికీ ఎస్టి కోయ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆయా గ్రామాలకు తాగనీరు సాగునీరు విద్య వైద్యం కరెంటు రోడ్ల సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఆదివాసీల పైన ఫారెస్ట్ అక్రమ దాడులు ఆపాలని. ఫోర్డ్ సాగుదారుల పైన పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ కోనబోయిన ధర్మరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోనబోయిన రామారావు, మడకం నాగేశ్వరరావు, వెట్టి ఇరమయ్య, మాస, ఉంగరాజు, సోడి ఇరమయ్య, జోగయ్య ఇంకా తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు అంకితబావంతో పని చేయాలి: ఏం ఈ ఓ సమ్మయ్య

భద్రాచలం, జూలై 17 (వాయిస్ టు డే ) ఉపాధ్యాయు లు అంకిత బావం తో పనిచేయాలని భద్రాచలం మండల విద్యాశాఖాధికారి సమ్మయ్య అన్నారు. పట్టణం లోని జగదీష్ కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో బదిలీ, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనం గా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుక ముఖ్యఅతిథిగా పాల్గొన్న భద్రాచలం మండల విద్యాశాఖ అధికారి సమ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరినారు. రిటైర్డ్ సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ముందు ఉండాలని కోరారు. జగదీష్ కాలనీ ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ గారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమైనదని అన్నారు. ఉపాధ్యాయులు వారి గురుతర కర్తవ్యాన్ని నిర్వర్తించి విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి కృషి చేయాలని కోరారు. ఈ రకంగా కృషి చేస్తున్న జగదీష్ కాలనీ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు దశంబాబు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయకుమార్, యుటిఎఫ్ మండలాధ్యక్షులు రమేష్ చందు, సన్మాన గ్రహీతలు జ్యోతి కుమార్, రామకృష్ణ, రమేష్, శ్రీను, తెల్ల%శీ% శ్రీనివాసరావు, విజయ్ కుమార్, పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు జయ రావు , ఉపాధ్యాయులు విజయ్ బాబు, వెంకన్న, వీరన్న, సమ్మక్క పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలులో బోకస్



సూర్యాపేట ,జూలై 7(వాయిస్ టుడే ప్రతినిధి) సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో రాష్ట్ర తెలుగు రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మొన్న సోమవారం రైతు రుణమాఫీపై మార్గదర్శకాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మార్గదర్శకాలలో స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని.. నిన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుటా హుటిన కలెక్టర్ల, విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మార్గదర్శకాలలో రేషన్ కార్డు తప్పని సరికాదన్నట్టుగా, రైతు రుణమాఫీలో గోల్డ్ లోన్ కూడా వర్తించేలా ఆదేశాలు ఇస్తున్నామని అంటూనే మార్గదర్శకాలలో ప్రవేశ పెట్టక పోవటానికి కారణం ఏమిటో తెలియట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ భోగస్ హామీలని ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ, గృహలక్ష్మి, కళ్యాణలక్ష్మి, పెన్షన్ లు, నిరుద్యోగం లాంటి విషయాలలో స్పష్టత లేకపోవడంతో రాబోవు రోజులలో ఉద్యమబాట పడతామని తీవ్రంగా హెచ్చరించారు.



## నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

రాయికల్: (వాయిస్ టుడే): రాయికల్ పట్టణానికి చెందిన బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు ఇమ్మడి విజయ్ కుమార్ హరిణి ల దంపతుల కుమారుడు హాశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం నూనె పప్పు సబ్బులు కూరగాయలుపంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలకు అయ్యే ఖర్చుతో ఒక నిరుపేద కుటుంబానికి సహాయం చేయడం మాకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కడకుంట్ల జగదీశ్వర్, చింతకుంట సాయికుమార్, యాచమనేని కిరణ్, భూక్య గంగాధర్ నాయక్, భూక్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తాలిపేరు ప్రాజెక్ట్‌ను సందర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం

భద్రాచలం, జూలై 17 (వాయిస్ టు డే ) చర్ల మండలంలో తాలిపేరు ప్రాజెక్ట్ ను బుధవారం స్థానిక ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించారు. డ్యాం నీటి సామర్థ్య పెరగడం వలన గేట్లు ఎత్తి అధికారుల సమక్షం లో దిగువకు నీటిని విడుదల చేసారు. తాలిపేరు ప్రాజెక్టు కార్యాలయం ను సందర్శించి సీసీ కెమెరాలు పర్యవేక్షించారు. దిగువన ఉన్న గ్రామాలకు ముందస్తుగా సమాచారాన్ని తెలియజేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాలిపేరు ప్రాజెక్టు డీఈ తిరుపతి పాల్గొన్నారు.



# భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయండి



సూర్యాపేట ,జూలై17 (వాయిస్ టుడే ప్రతినిధి). ఈనెల 21 22 23 తేదీలలో వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో జరగనున్న భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ పిలుపు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ వరకు త్వరలోనే నిర్వహించనున్న పాదయాత్ర విధివిధానాలపై రాష్ట్ర కార్యవర్గంలో చర్చించనున్నట్లు వెల్లడి

ఈనెల 21 22 23 తేదీలలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట లో జరగనున్న భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు బుధవారం చివ్వెంల మండలం గుంపుల గ్రామంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు అధ్యక్షతన నిర్వహించిన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి చివ్వెంల మండలం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ 6000 కు పెంచుతామని ఆర్టీసీలో వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీచేస్తామని రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టం 2016 సమర్థవంతంగా అమలు చేస్తామని స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు జనాభా ధామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టడుగు నుండి దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగుల సామాజిక వర్గానికి ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వికలాంగుల సమాజాన్ని చిన్నచూపు చూసిన తీరును నిరసిస్తూ తక్షణమే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ వరకు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి పాదయాత్ర నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట అధ్యక్షులు గిద్దె రాజేష్ వెల్లడించారు పాదయాత్ర విధివిధానాలపై ఈనెల 21 22 23 తేదీలలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో సమగ్రంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోగుల శేఖర్ రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మున్నా మధు యాదవ్ జిల్లా మహిళా వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 15లోపు రెండు లక్షల రుణమాఫీ

### రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీల కృషి

### తాజా మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్...

కామారెడ్డి బ్యూరో 17 జూలై వాయిస్ టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 18 జూలై గురువారం నుంచి రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీని వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తాజా మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో రాహుల్ గాంధీ రైతుల కోసం 2 లక్షల రుణమాఫీని అమలు చేయాలనే పథకాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందపరిచినారు. దానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్లో రుణమాఫీని ఆమోదించుటకు నిర్ణయం తీసుకున్నారు. అందుకుగాను నేటి నుంచి రూపాయలు లక్ష చొప్పున రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. విడతలవారీగా ఆగస్టు 15వ తేదీ లోపు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణాన్ని మాఫీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని జెడ్పిటిసి తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ద్వేయమని , రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందనే ఉద్దేశంతో రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. గురువారం రోజున రైతులు సంబరాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతరెడ్డి, టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు,డిసిసి జనరల్ సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, నల్లపు శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, అబ్రబోయిన రాజు,నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మహమ్మద్ షబ్బీర్ అలీ దోమకొండ పర్యటన...

రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఎస్టీ ఎస్టీ మైనార్టీ శాఖల ముఖ్య సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ దోమకొండ మండలంలో పర్యటించనున్నారని మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ బుధవారం తెలిపారు.

## దోమకొండ మండలంలో పర్యటించిన కేంద్ర జలాశక్తి బృందం



కామారెడ్డి బ్యూరో 17 జులై వాయిస్ టుడే: కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలో బుధవారం కేంద్ర జలశక్తి సభ్యుల బృందం సీతారాంపూర్, అంచనూర్, దోమకొండ పట్టణం తోపాటు పలు గ్రామాలలో నీటి నిలువ పనులను ఎన్ఆర్ఈజీఎస్ పనితీరును బృందం పరిశీలించింది. ఫామ్ పౌండ్, ఫిష్ పాండ్, మినీ ట్యాంక్, ఆర్టికల్చర్ వర్క్స్ పనులను పరిశీలించారు. బెంజమీన్ కరుణాకరన్, అత్తర్ వా శ్రీకృష్ణ పవర్, ఏపీ డి వామనరావు, ఎఫ్ ఎం రామ్ నారాయణ, ఎంపీడీవో రమేష్, ఎంపీ ఓ తిరుపతిరెడ్డి, ఏపీవో రజిని, డిఆర్పి హరికృష్ణ, ప్లాంటేషన్ సూపర్వైజర్ సురేందర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజా గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన డిఆర్ఎం



భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను బుధవారం డిఆర్ఎం బర్తేస్ కుమార్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎస్కే కాజా బాబా ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఖాజా బాబా మాట్లాడుతూ నూతన రైల్వే క్వార్టర్స్ ను నిర్మించాలని, పాత క్వార్టర్స్ పునరుద్ధరించాలని అన్నారు. ఇంజనీరింగ్ రైల్వే కార్మికులకు టూల్ బాక్స్ వద్ద విశ్రాంతి రూములు నిర్మించాలని అన్నారు. కార్మికులకు రైల్వే రిఫరల్ ఆస్పత్రులు కొత్తగూడెం లో సింగరేణి, ఖమ్మం లో ఆరోగ్య ఆసుపత్రుల కాల పరిమితి ముగిసినందున కొత్తగూడెం, ఖమ్మం ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నందు నడుస్తున్నటువంటి ప్యాసింజర్ రైళ్ల లోకో పైలట్లను ఇతర ప్రాంతాలకు తరలించవద్దని కోరారు.రైల్వే ఇన్స్టిట్యూట్ లో ఇండోర్ షటిల్ కోర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై డిఆర్ఎం సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులకు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కోలా వెంకటేశ్వర్లు, ఇనిస్ట్యూట్ సెక్రటరీ ఓం కుమార్, యూత్ కన్వీనర్ బస్వరి పుల్లయ్య, కో కన్వీనర్ రవితేజ, పవన్, ఉదయ్, హరిబాబు, అనిల్, సాంబశివరావు, లక్ష్మణ్, మనోజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గొట్టుముక్కల (సీతారాంపూర్) గ్రామానికి చెందిన పి. శ్రావణ్ కుమార్ గౌడ్ హైకోర్టు ప్లీడర్ గా నియామకం

### - మారుమూల గ్రామానికి దక్కిన అరుదైన గౌరవం



కామారెడ్డి బ్యూరో 17 జులై వాయిస్ టుడే: మారుమూల గ్రామానికి అరుదైన గౌరవం దక్కింది. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామం నుండి హైకోర్టు ప్లీడర్ గా నియమితులైన గొట్టుముక్కల నారా గౌడ్ చిన్న కుమారుడు పి శ్రావణ్ కుమార్ గౌడ్ ను ప్రభుత్వం హైకోర్టు ప్లీడర్ గా నియమించింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్లీడర్ గా కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం గొట్టిముక్కల (సీతారాంపూర్) గ్రామానికి చెందిన (గొట్టిముక్కుల) పి, నారాయణ గౌడ్ కుమారుడు పి. శ్రావణ్ కుమార్ గౌడ్ ను నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా 19 మందిని ప్రభుత్వ అడ్వకేట్లుగా నియమించింది. వీరు హైకోర్టులో ప్రభుత్వ కేసులను వాదించనున్నారు. న్యాయశాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి పేరిట జీవో 399 ని జారీ చేసింది. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం గొట్టిముక్కల (సీతారాంపూర్) గ్రామానికి చెందిన శ్రావణ్ కుమార్ గౌడ్ 10వ తరగతి వరకు కామారెడ్డిలో అభ్యసించి ఉన్నత చదువులను హైదరాబాద్లో అభ్యసించాడు. లా పూర్తి చేసి హైదరాబాదులోని హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. న్యాయవాదిగా పనిచేసిన సమయంలో హైకోర్టు బార్ అసోసియేషన్ ట్రెజరర్ గా కూడా పనిచేశారు. శ్రావణ్ కుమార్ గౌడ్ చేసిన సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ ప్లీడర్ గా నియమించింది. శ్రావణ్ కుమార్ గౌడ్ ను హైకోర్టు ప్లీడర్ గా నియమించడంతో గ్రామస్తులు, కామారెడ్డి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న పాలకవర్గం

### అక్రమంగా జరిగిన సంత వేలం పాటను రద్దు చేయాలి

### సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 17) మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టే విధంగా మున్సిపల్ పాలకవర్గం వ్యవహరిస్తుందని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అన్నారు.అక్రమంగా టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మంచికంటి భవన్ లో జరిగిన టౌన్ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇటీవల కాలంలో అనేక రకాలుగా నిధులు దుర్వినియోగం జరుగుతున్నదని, ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోగల వారాంతపు సంత టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సిన కనీస పద్ధతులు పాటించకుండా ఏకపక్షంగా నిర్వహించడం జరిగిందని ఆరోపించారు.టెండర్ పిలిచే ముందు పాటించవలసిన కనీస నిబంధనలు అత్యధిక సర్కులేషన్ ఉన్నటువంటి పేపర్లలో ప్రకటన చేయడము,మైక్ సెట్ పెట్టి మున్సిపాలిటీ మొత్తం ప్రచారం చేయవలసినటువంటి బాధ్యత ఇలాంటివి నిబంధనలు ఏమి కూడా పాటించకుండా తప్పు దోవలో టెండర్ ప్రక్రియను నడిపారని అన్నారు. డైలీ మార్కెట్,సంత,కబేళ టెండర్లు తక్కువ వేలం పాటకు ఇచ్చి ప్రజల ఆదాయాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు.

ఇదే వారాంతపు సంత పూర్వం యాభై లక్షలు అంతకు పూర్వం డెబ్బై లక్షల కు వరకు కూడా పాట జరగడం జరిగింది. కానీ ఈసారి ఎనిమిది లక్షలకు మాత్రమే వారాంతపు సంత పాట అయినట్లుగా మున్సిపల్ అధికారులు ప్రకటించడం చాలా విచిత్రంగా ఉందనీ ఎద్దేవా చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి ఇంత పెద్ద ఎత్తున నష్టం జరుగుతుంటే మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వారాంతపు సంత, డైలీ వేజ్ సంత చికెన్ మటన్ వ్యర్థాల మూత్రశాలలు, కబేలాల టెండరలలో అవినీతి జరిగినా, డస్ట్ బిన్లు,చలివేంద్రం, డబల్ బెడ్రూం వాహనాల నిర్వాణలో అవినీతి జరిగిందని తక్షణమే మున్సిపాలిటీ లో అభివృద్ధి పేరుతో జరిగిన అవినీతి పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు భూక్యా రమేష్, టౌన్ కమిటీ సభ్యులు డి వీరన్న, సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, నండిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## టీజెఏసీ షాద్ నగర్ ఆధ్వర్యంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

షాద్ నగర్ /వాయిస్ టుడే /జులై 17: నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, ప్రజల విముక్తి కోసం పోరాడి అమరుడైన పండుగ సాయన్న జయంతి వేడుకలను స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఎదురుగా ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ షాద్నగర్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ షాద్నగర్ చైర్మన్ ఎం జనార్ధన్, కన్వీనర్ నక్క బాల్ రాజ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి రామారావు, రవీంద్రనాథ్, మందారం నరసింహులు,ఆర్టీసీ అర్జున్ కుమార్, బి.నర్సింహులు మరియు అనంత్ లు పాల్గొన్నారు.



## ఘనంగా తొలి ఏకాదశి పూజలు



సూర్యాపేట ,జులై17 (వాయిస్ టుడే ప్రతినిధి) ఉగాది తర్వాత వచ్చే పండుగలలో మొదటి పండగ అయిన తొలి ఏకాదశి వేడుకలను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి పంచామృతములతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు స్వయంగా స్వామివారి గర్భగుడిలోకి ప్రవేశించి తమ అస్వహస్తాలతో అభిషేకం చేసుకునే విధంగా ఏర్పాటు చేశారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా సామూహికంగా శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు సోమ శ్రీశైలం దేవర్శెట్టి సోమయ్య యామా వెంకటేశ్వర్లు బ్రాహ్మణపల్లి దేవి దత్తు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, కనక రత్నం జగదీశ్వరి దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా తహసిల్దార్ రోడ్డులోని శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయంలో మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడి రైతులంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

### పలు దేవాలయాల్లో పూజలు

తొలి ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయంలో భక్తులు తెల్లవారి నుండి పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా దేవాలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.



## సూర్యపేటను పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తా

### తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి


సూర్యపేట, జూలై 17(వాయిస్ టుడే ప్రతినిధిలి) సూర్యాపేటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆరెగూడెం , దాస్ తండా కు చెందిన వివిధ పార్టీల నాయకులు పులగం వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం లో భాగంగానే చేరికలని స్పష్టం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లోను కాంగ్రెస్దే గెలుపు ఖాయమని అన్నారు. ఇంజనీర్ల బృందంతో ఇప్పటికే సూర్యాపేట అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించడం జరిగిందని పేట అభివృద్ధికి 61 కోట్లు ఎస్టిమేషన్ రూపొందించామన్నారు. అంతేకాకుండా పిల్లలమర్రి మూసి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక కేంద్రాలుగా మారుస్తానని తెలిపారు. టిఆర్ఎస్ మునిగిపోయిన పడవ, కాళేశ్వరం మాదిరిగా కుంగిపోయిందని ఇప్పుడో అప్పుడో కొట్టుకపోవడం ఖాయమన్నారు . సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నానని వివరించారు. సూర్యాపేటలో మూడు సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, అందులో భాగంగా నే రెండు లక్షల రుణమాఫీ చేస్తునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్ లు షఫి ఉల్లా, వెలుగు వెంకన్న, సీనియర్ నాయకులు గట్టు శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, నిమ్మల వెంకన్న, ఫరూక్, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, రమేష్ నాయుడు, ధర్మా నాయక్, వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం: కడియం

**రుణ మాఫీ పొందుతున్న రైతన్నలకు అభినందనలు.**

**రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లకు కృతజ్ఞతలు**

**మండలాల్లో, గ్రామాలలో సీఎం, రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి**



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: జాతీయ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ లో ఏర్పాటు చేసిన రైతు డిక్లరేషన్ లో భాగంగా ప్రజలు ఆశీర్వదించి అధికారంలోకి వస్తే రెండు లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు వరంగల్ లో రాహుల్ గాంధీ చేసిన ప్రకటన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15 లోపు 2 లక్షల రూపాయల పంట రుణాల మాఫీ చేస్తామన్న హామీ మేరకు నేడు (18 జులై 2024) మొదటి విడతగా లక్షరూపాయల పంట రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయబోతున్నామని కడియం బుధవారం ఒక ప్రకటన విడుదలచేశారు.

దేశంలో ఏ ప్రభుత్వం చేయని సాహసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్నదని.. రైతులను అప్పుల ఊబి నుండి బయటకు తీసుకు రావాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి రుణమాఫీకి పూనుకుందని ఇది ఒక సాహసోపేతమైన నిర్ణయం అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు రాజకీయంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. అదేవిధంగా రాహుల్ గాంధీ గారి హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం 2లక్షల రుణమాఫీకి ముందుకు వచ్చింది. మొదటి విడతగా రుణమాఫీ చెందుతున్న రైతులందరికీ అభినందనలు తెలియచేస్తున్నట్టు కడియం శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి సంబరాలు జరుపుకోబోతున్న ఒక గొప్ప రోజు అని కడియం సంతోషం వ్యక్తంచేశారు.

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ఏడు మండల కేంద్రాల్లో సంబరాలు నిర్వహించాలని, దానికి మండల పార్టీ నాయకత్వం వహించి రైతులను సమీకరించి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కోరుతున్నానని అన్నారు. గ్రామాల్లో మండలాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లకు కృతజ్ఞతలు చెప్పవలసిందిగా విజ్ఞప్తి చేస్తునానన్నారు. నేడు మధ్యాహ్నం 2:00 గంటలకు మండల కేంద్రాల్లోన్ని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అంబేద్కర్ విగ్రహం నుండి రైతు వేదిక వరకు ఊరేగింపు నిర్వహించి అనంతరం 3:00 గం.లకు రైతు వేదికల వద్ద రైతులతో కలిసి రాహుల్ గాంధీ మరియు రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేయవలసిందిగా కార్యకర్తలను నాయకులను కడియం శ్రీహరి కోరారు. తరువాత ప్రతి మండల కేంద్రంలోని రైతు వేదికలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడడానికి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారని, సాయంత్రం 4:00 గంటలకు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు అధికారులు పాల్గొని ముఖ్యమంత్రి సందేశాన్ని శ్రద్ధగా వినవలసిందిగా కడియం శ్రీహరి కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు, మండల పార్టీ శాఖలు, అనుబంధ సంఘాలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ సర్పంచులు గ్రామ శాఖలు అందరు కూడా లబ్ధిదారులైన రైతులతో కలిసి ఈ ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శ్రీహరి కోరారు.

## డీఎస్సీపరీక్ష కేంద్రం వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

### డిఎస్పీ రెహమాన్



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 17) కొత్తగూడెం జిల్లా పరిధిలో నుంచి ఆగష్టు 5 వరకు జరిగే డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ చట్టం -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ తెలిపారు.

జులై 18 తేది నుండి ప్రతి రోజు రెండు సెషన్‌లలో, ఉదయం 09:00 నుండి 12:00 మధ్యాహ్నం 2:00 %ూవీ% నుండి 05:00 %ూవీ% వరకు జరగనున్న డిఎస్సి పరీక్ష సందర్బంగా ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 6:00 వరకు సెక్షన్ 163 అంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని,ఎలాంటి సభలు,సమావేశాలు,ర్యాలీలకు, మైకులు,డిజేలతో ఉరేగింపులు,ధర్నాలు,ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు,వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డిఎస్పీ తెలియజేసారు.పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాలలో పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు సంబంధిత నిఘా ను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## జిల్లాలో లక్ష రూపాయల రుణం గల లబ్ధిదారులు 22,061

**నేడు రైతు వేదికల వద్ద సంబరాలు**

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన లక్షరూపాయల రుణమాఫీ లో భాగంగా వరంగల్ జిల్లాలోని 13 మండలాలలోని రైతు రుణ ఖాతాల్లో నేటి సాయంత్రం 4 గంటల లోపు సొమ్ము జమ చేసి వెంటనే రైతు వేదికల్లో సంబంధిత మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ల సమక్షంలో రైతు రుణమాఫీ లబ్ధిదారులతో సంబరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఖిలా వరంగల్ మండలంలోని బొల్లికుంట రైతు వేదికలో పాల్గొంటారని, నర్సంపేట రైతు వేదిక వద్ద శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట రైతు వేదికలో శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు పాల్గొంటారని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణముగల లబ్ధిదారులు 22 వేల 61 మంది ఉన్నారని కలెక్టర్ చెప్పారు. చెన్నారావుపేట మండలంలో 1296 మంది రైతులు, దుగ్గొండి మండలంలో 1900, గీసుకొండ మండలంలో 1387, ఖానాపూర్ మండలంలో 1297, ఖిలా వరంగల్ మండలంలో 345 వరంగల్ మండలంలో 73, నర్సంపేట మండలంలో 2049, నెక్కొండ మండలంలో 2648, పర్వతగిరి మండలంలో 2550, రాయపర్తి మండలంలో 2909, సంగెం మండలంలో 1957, వర్ధన్నపేట మండలంలో 1831 మంది లబ్ధిదారులు ఉన్నారని కలెక్టర్ అన్నారు. లబ్ధిదారుల వివరాల సమాచారం సంబంధిత ప్రజాప్రతినిధులకు, రైతులకు అందజేయడం జరిగిందని తెలిపారు. నిధులు పక్కదారి పట్టకుండా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఇతర ఖాతాలో జమ చేసుకుంటే బ్యాంకర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## నేటి నుండి జిల్లాలో రైతు రుణమాఫీ సంబరాలు

**సంబరాల్లో పాల్గొననున్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ శాఖల రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షట్కర్..**



కామారెడ్డి బ్యూరో 17 జూలై వాయిస్ టుడే: రాహుల్ గాంధీ వరంగల్ లో జరిగిన రైతు డిక్లరేషన్ లో ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేయబోతున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామన్నారు. నేటి నుండే అమలు చేస్తున్నారు. మొదటి విడతగా నేటి నుండి లక్ష రూపాయల లోపు ఉన్న రైతు రుణా మాఫీ చేయబోతున్నారు ఈనెల 25 నుండి 150000 వరకు ఆగస్టు1 నుండి 15 వరకు 2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తారు. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే రుణమాఫీ సంబరాల్లో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాసంపల్లి లో జరిగే రైతు రుణమాఫీ సంబరాల్లో పాల్గొంటారని డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు తెలిపారు.

## జమ్మికుంట శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన హుజూరాబాద్ జడ్జి

జమ్మికుంట జూలై 17 (వాయిస్ టుడే): జమ్మికుంట లోని శివాలయం (బొమ్మల గుడి)లో హుజరాబాద్ ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జ్ పద్మసాయిశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రోజున తొలి ఏకాదశి సందర్భంగా శివాలయాన్ని దర్శనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అన్నపూర్ణ సేవా సమితి వారు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం బొమ్మల గుడిలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమాన్ని వీక్షించి ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు అన్నపూర్ణ సేవా సమితి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు..



## పి.ఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంపై మతిభ్రమించి మాట్లాడిన హరీష్ రావు

**కోటీశ్వరులకు రైతు బంధు ఇచ్చి రాష్ట్రాన్ని పీకలలోతు అప్పుల్లోకి నెట్టింది మీ బి.అర్.ఎస్ సర్కార్ కాదా హరీష్ రావు.**

**10 ఏళ్లు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వని మీ దద్దమ్మ సర్కార్‌లో మంత్రిగా నీవు ఏమి పీకినావు హరీష్ రావు**

**బి.అర్.ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పై బీజేపీ నేత బేతి మహేందర్ రెడ్డి ఫైర్**



కరీంనగర్ జులై 17(వాయిస్ టుడే )దేశంలోని చిన్న సన్నకారు రైతుల బతుకులు ఆర్థికంగా బాగుపడాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకం ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న ఒక రైతు కుటుంబానికి మూడు విడతలుగా మొత్తం ఆరు వేల రూపాయలు ఇవ్వడమే కాకుండా ఎరువులకు భారీగా సబ్సిడీ ఇస్తూ దేశంలోని 9 కోట్ల 75 లక్షల రైతు కుటుంబాలను మోడీ ప్రభుత్వం ఆదుకుంటుంటే సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మీడియా సమావేశం పెట్టి ఈ పథకం పై రైతులను తప్పుదోవ పట్టించేలా మాట్లాడడం సిగ్గుచేటని, అలాగే హరీష్ రావుకు బి.అర్.ఎస్ ప్రభుత్వం కోల్పోయిన బాధలో హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని బీజేపీ నేత బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ఫైర్ అయ్యారు. మాజీ ముఖ్యమంత్రి కె.సి.అర్ మేనల్లుడిగా కొనసాగుతూ 10 ఏళ్లలో హరీష్ రావు ఆడిన ఆట తెలంగాణ రైతులు, ప్రజలు మరిచిపోరని, రాష్ట్రంలోని చిన్న సన్నకారు రైతులకు ఆర్థికంగా లబ్ది చేయకుండా, రాష్ట్రంలో రైతుల ముసుగులో ఉన్న బడా నేతలకు, వ్యాపారవేత్తలకు, కోటీశ్వరులకు రైతు బంధు పేర లక్షల్లో, కోట్లల్లో డబ్బులు ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని పీకలలోతు అప్పుల్లోకి నెట్టి బంగారు తెలంగాణ తెస్తామని చెప్పి అప్పుల తెలంగాణగా మార్చింది మీ దద్దమ్మ సర్కార్ అయిన బి.అర్.ఎస్ సర్కార్ కాదా అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ను బేతి మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. అలాగే కొత్త రాష్ట్రంలో కొత్త తెల్ల రేషన్ కార్డులు వస్తాయని వేయి కళ్లతో ఎదురుచూసిన పేద, మధ్యతరగతి ప్రజల ఆశలను ఆడియాశలు చేసింది గతంలోని మీ బి.అర్.ఎస్ సర్కార్ కాదా అని హరీష్ రావు పై మహేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఛీ కొట్టిన కూడా ఇంకా సిగ్గులేకుండా కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, అందులో ముఖ్యంగా రైతులకు మేలు చేసే కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకాన్ని విమర్శించడం హరీష్ రావు యొక్క దివాలకోరుతనానికి నిదర్శనమని, భవిష్యత్ లో రైతులకు మేలు చేసే పథకాల పై లేనిపోని ఆవాస్తవాలు మాట్లాడిన లేదా ఆరోపణలు చేసిన రైతులు ఉరికించి కొట్టె రోజులు వస్తాయని హరీష్ రావు ను బీజేపీ నేత బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు.



## సంబరాలకు ముస్తాబవుతున్న రైతు వేదికలు

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: వొడితల ప్రణవ్**

హుజూరాబాద్ జూలై 17(వాయిస్ టుడే): హుజురాబాద్ నియోజకవర్గం లోని రైతు వేదికలు సంబరాలకు ముస్తాబవుతున్నాయని, ఇచ్చిన హామీలను నెరవేర్చే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష రూపాయల లోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తున్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లోని రైతు వేదికల వద్ద వ్యవసాయ అధికారులు, రైతు వేదికలను ముస్తాబు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు రైతుల ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తారు. ఇట్టి కార్యక్రమాన్ని టీవీ మానిటర్ ద్వారా రైతులు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించేలాగా వ్యవసాయ అధికారులు రైతు వేదికల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష రూపాయల రుణమాఫీ ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుంది. ఇట్టి కార్యక్రమము విజయవంత చేయుట కొరకు హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ కాంగ్రెస్ నాయకులకు దిశ నిర్దేశం చేస్తున్నారు. రైతు ఉత్సవాల సంబరాల భాగంగా రైతులకు కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేస్తారు. హుజురాబాద్ నియోజకవర్గం లోని పలు గ్రామాల రైతు వేదికల వచ్చిన రైతులతో రుణమాఫీ సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్ గారు. పాల్గొంటారు.

## మోది చేసిన అభివృద్ధి వల్లే ముడో సారి కేంద్రంలో బిజేపి

**6 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు..**

**నిరుద్యోగులు, మహిళలు, రైతుల పక్షాన ప్రభుత్వ హామీల అమలుకై బీజేపీ ఉద్యమం చేస్తుంది..**

**ఆర్మూర్ ఎం ఎల్ ఏ రాకేష్ రెడ్డి..**

**క్షేత్రస్థాయిలో పార్టీ ఇంకా బలపడాల్సి ఉంది..**

**ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తే స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయం..**

**రానున్న స్థానిక ఎన్నికల్లో వార్డు సభ్యుని నుండి జెడ్పి ఛైర్మెన్ వరకు అన్ని బీజేపీ ఖాతాలో ...**

**కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి**



కామారెడ్డి బ్యూరో: నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి తో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి లు అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో అధ్యక్షురాలు అరుణా తారా అధ్యక్షతన కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణా తారా బీజేపీ జండా ఆవిష్కరించారు అనంతరం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జరిగిన అంశాలపై తీర్మానాలు ఆమోదించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ ఆధిక్యత ప్రదర్శించింది అని, కానీ క్షేత్రస్థాయిలో పార్టీ ఇంకా బలపడాల్సి ఉంది అని అన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తే స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయం అని ఆశాభావం వ్యక్తంచేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వార్డు సభ్యుని నుండి జెడ్పి ఛైర్మెన్ వరకు అన్ని బీజేపీ ఖాతాలో పడాలనీ సూచించారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఆర్మూర్ శాసన సభ్యులు రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో మోది చేసిన అభివృద్ధి వల్లే మరోసారి కేంద్రంలో బిజేపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. 6 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. ఉద్యోగాలు, మహా లక్ష్మి పథకాల అమలు, రైతు రుణ మాఫీ, రైతు బంధు అమలు వంటి హామీల అమలుకై నిరుద్యోగులు, మహిళలు, రైతుల పక్షాన బీజేపీ రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమం చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నెరెళ్ళ ఆంజనేయులు, మాజీ ఎంఎల్ఏ గంగారాం, బీజేపీ నాయకులు మురళీధర్ గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, చిన్న రాజులు, పైలా కృష్ణారెడ్డి, రంజిత్ మోహన్, రాము, రవీందర్ రావు, శ్రీనివాస్, విపుల్, భరత్, నరేందర్ రెడ్డి వివిధ మోర్చల జిల్లా అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథం ఆశయ సాధనకై ఉద్యమించండి

## సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్



తొర్రూరు, జూలై 17 వాయిస్ టుడే: కామ్రేడ్ పెరమండ్ల జగన్నాథం ఆశయ సాధనకై ఉద్యమించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. బుధవారం తొర్రూర్ మండలం గుర్తూరు గ్రామంలో మానుకోట సిపిఎం పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పెరమాండ్ల జగన్నాథం 43వ వర్ధంతి నీ సిపిఎం పార్టీ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. వారి స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొల్లం అశోక్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా మానుకోట తాలూకాలో సిపిఎం పార్టీ ఉద్యమం నిర్మాణంలో కీలకపాత్ర వహించిన నేత కామ్రేడ్ పెరమండ్ల జగన్నాథం అని వారు అన్నారు. ఆ రోజుల్లో భూస్వాములకు వ్యతిరేకంగా జీతగాండ్లను సమీకరించి వాళ్ళ హక్కుల కల్పించాలని పాలేరుల సంఘం పెట్టివారి సమస్యల పరిష్కారం కోసం పోరాడిన నాయకుడు జగన్నాథం. ఆర్మీ నుండి వచ్చి పేద మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి ఇబ్బందులు చూసి చెలించిపోయి, పేదల సమస్యలకు పరిష్కారం కమ్యూనిజమే మార్గం అని, పేదలను ,వృత్తిదారులను సమీకరించి సమస్యలపై పోరాడడంలో ముందు ఉండేవాడని వారు ఈ సందర్భంగా అన్నారు. కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గీత కార్మికులందరినీ ఐక్యం చేసి గ్రామ సొసైటీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రుణాలు ఇవ్వాలని, హక్కులు కల్పించాలని పోరాటం చేసి కల్లుగీత కార్మికుల హక్కులను సాధించిన నాయకుడు జగన్నాథం అని వారు కొనియాడారు. పేద బలహీన వర్గాల ప్రజలను అందరిని ఐక్యం చేసి భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడపడంలో అగ్ర గన్యుడు. ఇది చూసిన మన ఆగడాలు ఈ నడవవాని గమనించిన గ్రామ భూస్వాములు, కాంగ్రెస్, రాడికల్స్ గుండాలు పెరమాండ్ల జగన్నాథంను1981 జులై 17న అర్ధరాత్రి అతికిరాతకంగా హత్య చేయడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జగన్నాథం మరణించిన ఎల్లపుడూ వారి ఆశయ సాధనకు సిపిఎం పార్టీ ముందుంటుందని, వారి ఆశయాలను ముందుకు తీసుకుపోతామని వారి సందర్భంగా గుర్తుకు చేశారు. మండలంలో జగన్నాథం ఉన్నప్పటి రోజులు మళ్లీ రావాలని అన్ని గ్రామాలలో ఎర్రజెండాలు రెపరెపలాడాలని దానికి యువత కంకణబద్ధులై చైతన్యంతో పోరాటాలకు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఎర్ర జెండా వారసులు అభిమానులు అందరూ మళ్లీ పునరాలోచించి కమ్యూనిస్టు పార్టీలోకి రావాలని వారు ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తోరూర్ మండల కార్యదర్శి ఎండి యాకుబ్, నెల్లికుదురు మండల కార్యదర్శి పెరమాండ్ల తిలక్ బాబు, గ్రామ కార్యదర్శి గుద్దేటి సాయి మల్లు, మార్గ సాంబయ్య, బోర స్వామి, జితేందర్, ఉమ గాని యాకయ్య బొల్లం మమత, మార్క సుధాకర్, సోమయ్య, సత్యం ,శీను, తిమ్మిడి రవి, కొత్త వెంకటరెడ్డి, ధరావత్ యాకన్న,సారయ్య, రజినీకాంత్, వారి కుటుంబ సభ్యులు పెరమండ్ల మధుబాబు, లెనిన్ బాబు, స్నేహలత, సరోజన తదితరులు పాల్గొన్నారు.



## తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు

### కురుమ కులస్తుల ఆధ్వర్యంలో బీరప్పకు బోనం చెల్లింపు

### సామూహిక వనభోజనాలు



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బోయినపల్లి మండల ప్రజలు తొలి ఏకాదశి వేడుక లను వైభవంగా నిర్వహించుకున్నారు. బుధవారం ఉదయం తమ తమ గృహాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని మండల ప్రజలు భక్తుశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. తొలి ఏకాదశి పురస్కరించుకొని బోయినపల్లి మండలం విలసాగర్ గ్రామంలో కురుమ కులస్తులు బీరప్ప దేవుని కి ప్రత్యేక బోనాన్ని సమర్పించారు అనంతరం కురుమ కులస్తులు వనభోజనాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ హిందువులకు మొదటి పండుగ అయిన తొలి ఏకాదశి ఘనంగా జరుపుకున్న వాని ఈ సందర్భంగా బీరప్ప దేవునికి బోనం సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురిచి పాడిపంట, గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని బీరప్ప దేవుని వేడుకున్నట్లు కనకయ్య తెలిపారు

## ఖనీలో బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది గస్తీ: ఏసిపి రమేష్



ఈరోజు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లూ మరియు పెట్రో కార్ డ్యూటీ చేస్తున్న సిబ్బందికి పర్మినెంట్గా మొబైల్ నెంబర్లు ఉండాలని ఉద్దేశంతో పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజి ) ఆదేశాలతో గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మొబైల్ నంబర్స్ కేటాయించడం జరిగింది. ఈ ఫోన్ నెంబర్లతో డ్యూటీలో ఏ సిబ్బంది ఉన్న ఈ ఫోన్ నెంబర్స్ అట్టి బ్లూ క్లోట్స్ , పెట్రో కార్ సిబ్బదికి పర్మినెంట్ గా ఉంటాయి. ఇది ప్రజలు గమనించాలి.

BC1:9959822621, BC2:9676942622
BC3:9032942623, PATRO CAR: 6309242624

అదేవిధంగా ఈరోజు బ్లూ కోర్టు సిబ్బందికి నైట్ టైం లో గస్తీ నిర్వహిస్తున్నప్పుడు చీకటి ప్రదేశంలో కూడా గస్తి నిర్వహించే విధంగా వారికి టార్చిలైట్లు ఇవ్వడం జరిగింది. రాత్రి వేళలో తిరుగుతున్నప్పుడు లాఠీలు కూడా క్యారీ చేయాలని ఏసిపి సూచించడం జరిగింది.

ఈ వర్షాకాలంలో సిబ్బంది యొక్క మొబైల్ ఫోన్లు, ట్యాబ్లు DIAL100 ఫోన్లు వర్షానికి పాడవకుండా సిబ్బందికి బ్యాగులు కూడా ఇవ్వడం జరిగినది. సంబంధిత వస్తువులను జాగ్రత్తగా ఉపయోగించుకుంటూ ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ సెక్యూరిటీ కల్పిస్తూ డ్యూటీ నిర్వహించాలని ఏసిపి బ్లూ క్లోట్స్ సిబ్బందికి, పెట్రో కార్ సిబ్బందికి మరియు వన్ టౌన్ పోలీస్ అధికారులు అందరికీ సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీరన్న స్వామి బోనాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి



వరంగల్ జులై 17 (వాయిస్ టుడే) వరంగల్ నగర వ్యాప్తంగా బోనాల ఉత్సవాల సందర్భంగా పండుగ సందడి నెలకొంది. బుధవారం నాడు వరంగల్ నగరంలోని ఓ సిటీలో జరిగిన బీరన్న స్వామి బోనాల ఉత్సవాల కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కలిసి పాల్గొని బోనం ఎత్తుకొని పోచమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ బోనాల వేడుకల్లో మహిళ లలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు చెల్లించు కొన్నారు. బోనాల సందర్భంగా ప్రజల కు ఇబ్బందులు లేకుండా అధికారులు పోలీస్ లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ, సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేకమని నగర ప్రజలందరికీ పోచమ్మ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ పోచమ్మతల్లి అమ్మవారి ఆశీస్సులు నగర ప్రజలందరి పై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు..



## భారత్ వికాస్ పరిషత్ నగర కార్యవర్గ సమావేశం

వరంగల్ జులై 17 (వాయిస్ టుడే) భారత్ వికాస్ పరిషత్ హన్మకొండ ( ఓరుగల్లు ) శాఖ ఆధ్వర్యంలో బృందగీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు అ శాఖ అధ్యక్షులు డా: సుధీర్ కుమార్ అన్నారు. బుధవారం నాడు హంటర్ రోడ్ లోని అవంతి హై స్కూల్ లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి వి పి తెలంగాణ ప్రాంత ఆదేశానుసరం ఆగస్టు రెండో వారం లోపు జాతీయ బృంద గీతాల పోటీలను నిర్వహించి పాల్గొన్న పాఠశాల లకు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆగస్టు చివరి వారంలో భారత్ కోజనో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. బి వి పి కార్యదర్శి కే. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తితో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో చంచల్ అగర్వాల్, గోవిందరాజులు, కన్వీనర్లు కమల మనోహర్ రావు,వివేకానంద, బి. యన్. రెడ్డి,రామారావు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీరాన్న బోనాల పండుగ లో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్ (వాయిస్ టుడే) జూలై 17: వరంగల్ ఉర్సు కరిమాబాద్ లో జరిగిన బీరాన్న బోనాల ఉత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ వరంగల్ ప్రజలందరూ సుఖసంతోషలతో ఉండాలని కోరుకున్నారు. ఈ బిరన్న బోనాల ఉత్సవం ఓరుగల్లు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందనీ అన్నారు.



## మత సామరస్యానికి ప్రతీక మొహరం పండుగ



తొర్రూరు, జూలై 17 వాయిస్ టుడే: తొర్రూర్ మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా మొహరం పండుగను ముస్లిం సోదరులు నిర్వహించడం జరిగింది. పట్టణ కేంద్రంలోనీ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఉన్నటువంటి పీరిల దేవాలయంలో మరియు మండలంలోని గుర్తురు గ్రామంలోనీ స్థానిక పీర్ల దేవాలయంలో పీరీలను ఘనంగా ముస్తాబు చేసి డప్పు సప్పులతో పురవీధులలో పీరిలను ఊరేగింపు నిర్వహిస్తూ ఘనంగా మొరం పండుగను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మహమ్మద్ షబ్బీర్ అలీ, మహమ్మద్ జలీల్, మహమ్మద్ అమీర్‌ల్లు సంయుక్తంగా మాట్లాడుతూ హిందూ ముస్లింల ఐక్యతకు పీర్ల పండగ చిహ్నమని తెలుపుతూ ఇరు తెలుగు రాష్ట్రాలతో పాట ప్రపంచం మొత్తం మొహరం పండుగను ఘనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొంటూ పిరిలను ముస్తాబు చేసి పట్టణ కేంద్రంలోని పురవీధులల్లో డప్పు చప్పులతో ఊరేగింపు చేస్తూ హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి ఈ పండుగను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఇస్లాం , స్వామి గౌడ్ సింగారం రాజు, సింగర్ కిరణ్ , పంజాల రాజు, జంపాల సందీప్ , పూస ఐలయ్య , పెండోట కిషన్ , మహమ్మద్ రియాజ్ , ముత్యం రాజు ఎండి. యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మిక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

### సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్

జమ్మికుంట జూలై 17(వాయిస్ టుడే): జమ్మికుంట మండలం లోని మడిపల్లి గ్రామానికి చెందిన మాచర్ల నగేష్ గౌడ్ బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు తాడిచెట్టు పై నుండి పడి మృతి చెందాడు, మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పది లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా సంవత్సరం గడుస్తున్నప్పటికీ కూడా తెలంగాణ రాష్ట్రంలో తాడిచెట్టు పై నుండి పడి మృతి చెందిన కుటుంబాలకు ఇప్పటివరకు ఐదు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా అంద లేదని వెంటనే నిధులు మంజూరు చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది ఈ విషయంలో , రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక చొరవ చూపెట్టి గీత కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాటమయ్య రక్షణ కవచం కిట్లను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గీత కార్మికులకు తక్షణమే అందించాలని ప్రమాదాల బారిన పడకుండా గీత కార్మికులను కాపాడాల్సిన బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు.



## రైస్ మిల్లులో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారుల ఆకస్మిక దాడులు

### సి ఎం ఆర్ ధాన్యం పక్కదారి పట్టినట్లు రుజువు

హుజూరాబాద్ జూలై 17(వాయిస్ టుడే): హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలోని ఎస్సార్ ట్రేడర్స్ మిల్లులో టాస్ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని సదరు రైస్ మిల్లు యజమాని పక్కదారి పట్టించినట్లు టాస్క్ ఫోర్స్ సివిల్ సప్లై అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి బాకీ ఉన్న ధాన్యం 14,805 క్వింటాళ్ల ధాన్యం వ్యత్యాసం ఉందని అధికారులు గుర్తించి కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేయగా, బాకీ ఉన్న ధాన్యానికి డబ్బులు లేదా ధాన్యం ఇస్తామని లిఖితపూర్వకంగా ఎస్సార్ ట్రేడర్స్ రైస్ మిల్ ఓనర్ బొబ్బల రాజిరెడ్డి అధికారులకు రాసి ఇవ్వడంతో అధికారులు కొంత గడువు ఇచ్చి వెళ్లారు. ఏది ఏమైనప్పటికీ హుజురాబాద్ పట్టణంలో పలువురు రైస్ మిల్లు యజమానులు సీఎంఆర్ ధాన్యాన్ని యదేచ్చగా సొంతానికి వాడుకొని కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని, తిరిగి ప్రభుత్వానికి బియ్యంగా లేవీ ఇవ్వకుండా కోట్లాది రూపాయలు కాజేయడం గత కొన్నేళ్లుగా అలవాటుగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటే గాని భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని పలువురు భావిస్తున్నారు.

## తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ జూలై17(వాయిస్ టుడే) తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో ప్రజలు వైభవంగా వేడుకలు నిర్వహించుకున్నారు. బుధవారం ఉదయం తమ తమ గృహాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు మండలంలోని వివిధ ఆలయాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని ప్రజలు భక్తుశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ పల్లా మురళి సదాలక్ష్మి దంపతుల శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ తోపాటు మండలంలోని పలు దేవాలయాల చైర్మన్ లు కమిటీ సభ్యులు తోపాటు. తదితరులు పాల్గొని అభిషేక కార్యక్రమం పూజలు ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు సావిత్రి శ్రావణ్ కుమార్ భక్తులకు తీర్థప్రసాలు అందజేశారు..

## గుండెపోటుతో రైతు కన్నుమూత

### మల్లారం గ్రామంలో విషాదఛాయలు...

భీమదేవరపల్లి వాయిస్ టుడే జులై 17: భీమదేవరపల్లి మండలంలోని మల్లారం గ్రామంలో పిట్టల సమ్మయ్య అనే రైతు బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు.. ఈ సందర్భంగా ఉదయం బావి దగ్గరికి వెళ్లి వచ్చిన సమ్మయ్య, ఇంటిదగ్గర సాధారణ పనులు చేస్తుండగా గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు... గ్రామంలో అందరితో కలిసికట్టుగా మెదిలే సమ్మయ్య, మంచి రైతుగా పేరుంది.... హఠాత్తుగా సమ్మయ్య మృతి చెందటంతో గ్రామంలోవిషాదఛాయలనుకున్నాయి... ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు...

## సింగరేణి ఓసీపీలో ప్రమాదం.. ఇద్దరు మృతి





పెద్దపల్లి జిల్లా: జూలై 17 (వాయిస్ టుడే) గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా రామగుండం సింగరేణి ఓపెన్ కాస్ట్2లో మట్టిపెళ్లలు కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పైప్లాన్ లీకేజీని మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం. నలుగురిపై మట్టి పెళ్లలు కూలాయి. ఆ మట్టిలో కూరుకుపోయిన ఇద్దరు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు. మృతులను ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ గా గుర్తించారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మృతి దేహాలు ఉన్నాయి.

# అరుణాచలగిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు



తొర్రూర్ జూలై 17 వాయిస్ టూడే: తమిళనాడు లోని అరుణాచలగిరి ప్రదక్షిణ చేయాలను కునే భక్తుల కు ప్రత్యేక బస్సు లు ఏర్పాటు చేసినట్లు తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతి కోరారు.బుధవారం వారు మాట్లాడుతూ.,గురు పౌర్ణమి సందర్భం గా జూలై 21 న అరుణాచలం లో జరిగే గిరి ప్రదక్షిణ కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ను టిజిఎస్ ఆర్ టిసి వరంగల్-1 డిపో ఏర్పాటు చేయడం జరిగిందని, సర్వీస్ నంబర్ 9222 గల సూపర్ లగ్జరీ బస్సు జూలై 19 న మధ్యాహ్నం 3 గంటల కు హన్మకొండ బస్టాండ్ నుండి బయలు దేరి జూలై 20 వ తేది న ఉదయం 6 గంటల కు ఆంధ్రప్రదేశ్ కాణిపాకం లోని విఘ్నేశ్వరుని దర్శనం చేసి, మధ్యాహ్నం 1 గంటల కు వెల్లూరు లోని శ్రీ మహాలక్ష్మి అమ్మ వారి దర్శనం అనంతరం సాయంత్రం 7 గంటల కు అరుణాచలం చేరు కుంటుందని,అరుణాచలేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత జూలై 21 తేది న అరుణాచలం నుంచి బయలు దేరి 22 న ఉదయం శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిది కి వెళ్తుందని,అక్కడ దర్శనానంతరం హన్మకొండ కు చేరుకుంటుందన్నారు.అరుణాచల గిరి ప్రదర్శన ను టూర్ ప్యాకేజీ ల గా టిజిఎస్ ఆర్ టిసి అందిస్తోందని,ఈ ప్యాకేజీ ధర ను ఒక్కొక్కరికి పెద్దల కు రూ.4,500,పిల్లల కు రూ.3,000 గా సంస్థ నిర్ణయించిందని,అన్ని సెస్ చార్జీ లు టోలు టాక్సులు,బోర్డర్ టాక్స్ కలుపు కొని టూర్ ప్యాకేజీ గా అందిస్తుందన్నారు. ఈ సదుపాయాన్ని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలను కునే భక్తులు వినియోగించు కోవాలి.ఈ టూర్ ప్యాకేజీ ని సంస్థ అధికారిక వెబ్ సైట్ tsrtconline.inలో ముందస్తు రిజర్వేషన్ చేసు కోవాలని,సమాచారం కోసం 9866373825, 7382855492 నంబర్ ల ను సంప్రదించాలని కోరారు.

## జేఎన్‌టీయూ హాస్టల్ భోజనంలో మళ్లీ పురుగులు



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ హైదరాబాద్ హాస్టళ్లలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనంలో పురుగుల కలకలం కొనసాగుతోంది. గౌతమి వసతిగృహంలో బుధవారం భోజనంలో పురుగులు కనిపించడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఇద్దరు విద్యార్థుల ప్లేట్లలో రెండు పురుగులు కనిపించగా.. ఆ భోజనం చేసేందుకు విద్యార్థులు భయపడ్డారు. జూన్ 15న అన్నం, మజ్జిగ పాత్రల్లో పిల్లి మూతిపెట్టిన విషయం తెలిసిందే. ఈ విషయమై బుధవారం ప్రచురితమైన కథనానికి రెక్టార్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, వార్డెన్లతో కలిసి బాలురు, బాలికల వసతిగృహాలను విస్తృతంగా తనిఖీ చేశారు. సంబంధిత సిబ్బంది నుంచి వివరణ కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సస్పెండ్ చేస్తామని రిజిస్ట్రార్ హెచ్చరించారు.

## 'భారాసను వీడే ప్రసక్తే లేదు'



పాలకుర్తి: పార్టీ మారుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఖండించారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, భారాస తరఫున ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. బుధవారం పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రైతు భరోసాపై ఇప్పటివరకు ఊసేలేదన్నారు. రుణమాఫీలో ఉన్న నిబంధనలతో అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. బమ్మెరలో మృతి చెందిన దివ్యాంగుల నేత, భారాస నాయకుడు మంద ఎల్లయ్య మృతదేహానికి దయాకర్‌రావు నివాళి అర్పించారు. కారక్రమంలో పార్టీ నేతలు నాగిరెడ్డి, శ్రీనివాసరావు, అఖిల్, గణేష్, మల్లేశ్ పాల్గొన్నారు.

## ప్రతిభ చూపితే ఉపకారం

### విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షలకు దరఖాస్తులు

జ్యోతినగర్ (మార్కండేయకాలనీ): తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థుల దృష్టిని పరిశోధన, ప్రయోగాల వైపు మరల్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ప్రభుత్వ పరిధిలోని విజ్ఞాన భారతి, విజ్ఞాన్ ప్రసార్, ఎన్‌సీఈఆర్టీ(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ ట్రైనింగ్) సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎమ్) ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలోని ఆరు నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.

**దరఖాస్తుల ప్రక్రియ ఇలా..**

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుము చెల్లించి వీవీఎమ్ వెబ్‌సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలి. సెప్టెంబరు 15 వరకు అవకాశం ఉంటుంది. నమోదు చేసుకున్న వారికి జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రకటించిన తేదీల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో పరీక్ష రాయొచ్చు. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు. సెప్టెంబరు 1న నమూనా పరీక్ష నిర్వహిస్తారు. అక్టోబరు 23, 27 (వీలును బట్టి ఏదైనా తేదీల్లో) పరీక్ష ఉంటుంది. నవంబరు 15న ఫలితాలు విడుదల చేస్తారు. డిసెంబరు 8, 15, 22 తేదీల్లో ఒక రోజు రాష్ట్ర స్థాయి పోటీలుంటాయి. 2025 మే 17 లేదా 18 తేదీల్లో జాతీయ స్థాయి పరీక్ష ఉంటుంది.

**నెలకు రూ.రెండువేలు**

వివరాలు నమోదు చేసిన వారికి వంద బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు చదివే సామాన్య, గణితం, పాఠ్యపుస్తకాల్లోని అంశాలు 50 శాతం, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతదేశ కృషిపై 20 శాతం, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలపై 20 శాతం మార్కులుంటాయి. లాజిక్, రీజనింగ్‌కు 10 శాతం ప్రశ్నలుంటాయి. పాఠశాల స్థాయి పోటీల్లో 18 మంది చొప్పున ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీలకు సబ్జెక్టులకు ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తారు. వీరికి ఆన్‌లైన్ ప్రశంసా, ధ్రువపత్రాన్ని అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 20 మందిని ఎంపిక చేస్తారు. వీరికి ధ్రువపత్రం, జ్ఞాపిక, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదును అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపితే రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున అందజేస్తారు. అలాగే భాస్కర స్కాలర్‌షిప్ పేరుతో ఏడాది పాటు నెలకు రూ.2 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు.

# మురళీకృష్ణ మందిరంలో ఘనంగా తొలి ఏకాదశి పూజలు



తొర్రూరు, జూలై 17 వాయిస్ టుడే: పట్టణ కేంద్రంలోని స్థానిక మురళీకృష్ణ మందిరంలో మాతృ మండలి సభ్యులు మా శెట్టి జమున ఆధ్వర్యంలో ఆషాడ శుద్ధ ఏకాదశి ( తొలి ఏకాదశి ) పండుగ ప్రాశస్త్యం సందర్భంగా ఆలయ పూజారి కాసోజు సాయినాథ్ శర్మ స్వామివారికి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించిన పిదప ఆలయానికి వచ్చిన భక్తులకు వారి పేరు గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించి స్వామివారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ పూజారి కాసోజు సాయినాథ్ శర్మ ఆలయానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ హిందువుల తొలి పండుగ తొలి ఏకాదశి ఈ పర్వదినంతోనే మన పండుగలు ప్రారంభమవుతాయని , ఈ ఏడాదిలోనే 24 ఏకాదశులు వస్తాయని, వీటిలో ఆషాడ శుద్ధ ఏకాదశి కావడంతో తొలి ఏకాదశి గా పిలుస్తారని అన్నారు. పురాణాల ప్రకారం శ్రీ మహావిష్ణువు క్షీర సాగరంలో శేషతల్పంపై నాలుగు నెలలపాటు శయనిస్తాడు కనుక శయన ఏకాదశి అని ఈ రోజు ప్రాచుర్యంలోకి వచ్చిందని అన్నారు. అంతేకాకుండా ఈ నాలుగు నెలలు స్వామివారు పాతాళ లోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని పురాణ గాథ ఒకటి ప్రాచుర్యంలో ఉందన్నారు. ముఖ్యంగా ఈ ఏకాదశి రోజున ఒంటి పూట భోంచేసి శేష సాయి అయినా లక్ష్మీనారాయణ మూర్తిని స్తుతిస్తే కోటి పుణ్యాల ఫలం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం అన్నారు. తొలి ఏకాదశి రోజంతా ఉపవాసం ఉండి రాత్రికి జాగారం చేసి మర్నాడు ద్వాదశి నాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళనమవుతాయని వేదాలు పురాణాల ద్వారా ప్రసిద్ధి అయ్యాయని తెలిపారు. ఈ విధానాలను ఆచరించడం ద్వారా పూజకు పూజ ఆరోగ్యానికి ఆరోగ్యం మానవాళి మనుగడకు మేలు చేకూరుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు హనుమాండ్ల మోహన్ రెడ్డి, మా శెట్టి రమేష్, కూరపాటి వెంకటేశ్వర్లు, మాతృమండలి సభ్యులు కాళెపల్లి అన్నపూర్ణమ్మ, మాశెట్టి సరస్వతమ్మ, ప్రభుత్వ ఉపాధ్యాయులు చింతల సురేష్, నాల్లం శ్రీనివాస్, తదితర భక్తులు పాల్గొన్నారు.



## రైల్వే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి

### ద.మ. రైల్వే జీఎంను కోరిన ఎంపీ ఈటల

హైదరాబాద్: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. బుధవారం ఆయనను కలిసి పలు పనులకు సంబంధించిన లేఖ అందజేశారు. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఉన్న రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఆర్వోబీలు, ఆర్‌యూబీలు పూర్తిచేస్తే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయన్నారు. మేడ్చల్-గుండ్లపోచంపల్లి మధ్య, మేడ్చల్-మల్కాజిగిరి స్టేషన్ల వద్ద రెండోవెంట్ ఆర్‌యూబీ పనులను పూర్తి చేయాలన్నారు. బొల్లారం యార్డ్ వద్ద ఆర్వోబీ మంజూరైందని, వాటి పనులు చేపట్టాలన్నారు. సుచిత్ర, భూదేవీనగర్ స్టేషన్ల వద్ద ఒక హాల్ట్, ఆనంద్‌బాగ్ స్టేషన్ వద్ద మరో హాల్ట్‌ను ఏర్పాటు చేసి రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మత్తు వదిలించేందుకు.. కొత్త ఎత్తు

రాజపేట, భువనగిరి: పట్టణాలు, గ్రామాలు మొదలుకుని ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుంది. ఈ మహమ్మారి కట్టడికి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే విద్యాలయాల్లోనూ నిలువరించే చర్యల్లో భాగంగా తాజాగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందాయి.

**కట్టడి క్లబ్ ఏర్పాటు ఇలా..**

క్లబ్ అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపల్ కొనసాగుతారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు లేదా చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్, సభ్యులుగా 6-10 తరగతుల నుంచి ఇద్దరు చొప్పున క్రియాశీల విద్యార్థులు, 6-10 తరగతులకు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది ఒకరు సభ్యులుగా ఉంటారు. కమిటీ కార్యకలాపాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లనూ వినియోగించుకోవచ్చని ఆదేశించారు. క్లబ్ నిర్వహణకు సంబంధించి అతి త్వరలో మార్గదర్శకాలు జీరీ చేస్తామని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**కమిటీ కార్యకలాపాలు ఇవీ..**

మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థులుంటే గుర్తించి వారిని అప్రమత్తం చేస్తారు. వాటి దుష్ప్రభావాలు వివరించి ఆ మహమ్మారి నుంచి దూరమయ్యేలా అవగాహన కల్పిస్తారు. వీటి అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తున్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకుని కట్టడి చేసి సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందిస్తారు. పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కలా ఏదైనా కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, పదార్థాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండేలా చేయడం కమిటీ చేపడుతుంది.



# కూరగాయలకు ధరల కాలం!

**రాష్ట్రంలో సాగు ఆలస్యం.. విస్తీర్ణంలోనూ తగ్గుదల**

**దిగుమతులపైనే ఆధారం**



హైదరాబాద్: టమాటా రూ.100, మిర్చి రూ.80, ఉల్లిగడ్డ రూ.60, ఆలుగడ్డలు రూ.50.. ఇవీ రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో కూరగాయల ధరలు.

వర్షాకాలంలో ధరలు తగ్గాల్సిన కూరగాయలు.. ఇంకా మండుతూనే ఉన్నాయి. ప్రధానంగా పంటల సాగు ఆలస్యంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు, మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఏటా ఈ సమయానికి రాష్ట్రంలో పండే కూరగాయల పంటలు మార్కెట్‌లోకి వస్తుండగా.. ఈసారి ఇంకా కాత దశలోనే ఉన్నాయి. వేసవిలో ఎండల తీవ్రత, జూన్‌లో వర్షాభావ పరిస్థితులు కూరగాయల సాగుపై ప్రభావం చూపాయి. సాగు విస్తీర్ణమూ దాదాపు 50 శాతం తగ్గింది.

**92 వేల ఎకరాల్లోనే పంటలు**

రాష్ట్రంలో ప్రతి వానాకాలంలో సాధారణంగా 1.71 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతుంటాయి. ఈసారి ఇప్పటివరకు 92 వేల ఎకరాల్లోనే పంటలు వేశారు. ఏటా మే నుంచే కూరగాయల సాగు ప్రారంభమవుతుండగా.. ఈసారి తీవ్రమైన ఎండల వల్ల చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బావుల్లోనూ నీరు ఇంకింది. దీంతో మేలో కూరగాయల సాగుతగ్గింది. జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. ముఖ్యంగా కూరగాయల సాగు అధికంగా ఉండే వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మెదక్ జిల్లాల్లో లోటు వర్షపాతం సాగుపై ప్రభావం చూపింది. కరీంనగర్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, సిద్దిపేట, ములుగు, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మేడ్చల్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ సరిగా వర్షాలు పడలేదు. ఈ నెలలో ఓ మోస్తరు వర్షాలు పడుతుండడంతో పలు జిల్లాల్లో రైతులు ఇప్పుడిప్పుడే కూరగాయల సాగు చేపడుతున్నారు.

**నిత్యం 42 వేల టన్నుల మేర దిగుమతులు**

రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి బాగుంటే.. 20 వేల టన్నుల మేర మాత్రమే దిగుమతి చేసుకుంటారు. ఇక్కడ లభ్యత తక్కువగా ఉంటే.. 42 వేల టన్నుల మేర దిగుమతి అవుతుంటాయి. గత మే నుంచి స్థానికంగా ఉత్పత్తులు లేక రోజూ 42 వేల టన్నులు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రధానంగా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, దిల్లీ తదితర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. రవాణా భారం పెరగడం, కొరత దృష్ట్యా వ్యాపారులు ధరలు పెంచుతున్నారు.

**టమాటా పావువంతే సాగు**

రాష్ట్రంలో ప్రతి వానాకాలం సీజన్‌లో 22 వేల ఎకరాల్లో టమాట సాగు అవుతుంది. ఈసారి 8 వేల ఎకరాల్లో.. అదీ ఈ నెలలోనే పంటలు వేశారు. దీంతో మార్కెట్లో లోకల్ టమాటా కనిపించడం లేదు. దిగుమతి చేసుకుంటున్న టమాటా ధర జూన్ ఆరంభం నుంచి చుక్కలు చూపిస్తోంది. రైతుబజార్లలో రూ.65 ధర ఉన్నా.. అక్కడున్న టమాటాల్లో కొన్ని మెత్తబడడం, పాడైపోయి ఉండడం వినియోగదారులు నచ్చినవి తీసుకునే వీల్లేక పోవడంతో కొనుగోళ్లు పెద్దగా సాగడం లేదు. బయటి మార్కెట్లో వంద వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. చిక్కుడు రూ.100, క్యాప్సికం రూ.80, బీన్స్ రూ.70, వంకాయ, బెండ, బీర, దొండకాయలను రూ.40కి విక్రయిస్తున్నారు. ఆకుకూరలను రూ.20కి నాలుగు చిన్న కట్టలు ఇస్తున్నారు.